## విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ... అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...

8333818121

ఎడిటర్ పెనగొండ సతీష్



# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964

akankshanews.com

తెలుగు సంచలన దిన పత్రిక



## రిపోర్టర్లు కావలెను

పాలమ్మడికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మాతవంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,మార్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాలో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు · మండల · నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number : 9908333465.8333818121



ప్రచురణ : తెలంగాణ | సంపుటి : 01 | సంచిక : 104 | ఎడిటర్ :పెనుగొండ సతీష్ | మంగళవారం 2 డిసెంబర్ 2025 | పేజీలు 8 | వెల






# ఓటమిని కూడా అంగీకరించలేని విపక్షం

- సమస్యలపై చర్చకు ఎప్పుడూ సిద్ధమే
- సభా సమయాల్లో డ్రామాలు వద్దు
- విపక్షాలకు ప్రధాని మోడీ చురకలు



(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, డిసెంబర్ 1 : బీహార్ పరాజయాన్ని కూడా ఒప్పుకునే మనసు విపక్షానికి లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ ప్రతిపక్ష కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు ఆయన సూచించారు. ఈ మేరకు ప్రతిపక్ష ఇండియా కూటమిపై నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా సోమవారం పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మోడీ మాట్లాడారు. ఈ సమావేశాల్లో అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. 'సమావేశాలు సజావుగా ముందుకు సాగేందుకు ప్రతిపక్షాలు

2 లో

# పాలమూరు బిడ్డగా ఈ గడ్డను అభివృద్ధి చేస్తా


- బూర్గుల తరవాత నాకే అవకాశం ఇచ్చారు
- దశాబ్దాల జిల్లా కరువును పారదోలుతా
- గత పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో తీవ్రనిర్లక్ష్యం
- ఉమ్మడి ఏపిలోనూ.. తెలంగాణలోనూ జిల్లా నిర్లక్ష్యం
- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తా
- మక్తల్ సభలో సిఎం రేవంత్ రెడ్డి



(ఆకాంక్ష న్యూస్)

నారాయణపేట, డిసెంబర్ 1 : పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను పదేళ్లపాటు గత బిఆర్ఎస్ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక తెలంగాణలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఈ ప్రాంతానికి ఏదైనా చేయాలని గతంలో ఏ నేత కూడా అనుకోలేదని విమర్శించారు. అందుకే ఈసారి ఇక్కడి ప్రజలు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తుంది. రెండేళ్ల విజయోత్సవ సభను మక్తల్‌లో నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి బూర్గుల

2 లో



## రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత

- ఆత్మహత్య కాదది.... ప్రభుత్వ హత్యే
- ఎక్స్ వేదికగా హరీష్ రావు ఆరోపణ

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, డిసెంబర్ 1 : ఖమ్మం జిల్లాలో రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యతని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఈ ఘటనపై స్పందించిన అయన రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రైతుది ఆత్మహత్య కాదని.. ప్రభుత్వ హత్యే అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.కౌలు రైతుల రైతు భరోసాకు సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కౌలు రైతుల బతుకులకు భరోసా లేకుండా చేస్తోందంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. 'కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పి, నేడు వారి బతుకులకు భరోసా లేకుండా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు

2 లో

## తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయండి

- హడ్కో ఛైర్మన్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- ప్రతిష్టాత్మక ప్రాజెక్టులపై చర్చ



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, డిసెంబర్ 1 : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హడ్కో ఛైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠను కోరారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కులశ్రేష్ఠ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణాలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని సీఎం హడ్కో ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూర్, అమరావతి మీదుగా చెన్నై వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి, బులలెట్ ట్రైన్ నిర్మాణాలపై ముఖ్యమంత్రి... హడ్కో ఛైర్మన్‌ల

2 లో

## చురుకుగా మేడారాం అభివృద్ధి పనులు

- గద్దెల చుట్టూ పచ్చదనం..ఫ్లడ్లైట్ల ఏర్పాటు
- పనులను సమీక్షించిన సిఎం రేవంత్ రెడ్డి



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, డిసెంబర్1 : మేడారం ఆలయ అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుడి చుట్టూరా పచ్చదనం అభివృద్ధి చేయాలని సూచించారు. ఆలయ పనులపై జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం

2 లో

## విపక్షాల ఆందోళన... వాయిదాల పర్వం...

- మొదలైన తొలిరోజు పార్లమెంట్ సమావేశం



(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, డిసెంబర్ 1 : లోక్‌సభ సమావేశాలు వాయిదాల పర్వంతో మొదలయ్యాయి. శీతాకాల సమావేశాల తొలిరోజే వాయిదా పడింది. సోమవారం ఉదయం 12.00 గంటలకు మళ్లీ ప్రారంభమైన సభలో విపక్ష సభ్యులు.. తమ పట్టు వీడలేదు. సర్, ఢిల్లీ బాంబు పేలుళ్లు, ఢిల్లీలో కాలుష్యం తదితర అంశాలపై చర్చ జరగాల్సిందేనంటూ వారంతా పట్టు పట్టారు. దీంతో మధ్యాహ్నం 2.00 గంటల వరకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఉదయం 11.00 గంటలకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలు ప్రారంభం కావడంతో.. రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసగిం చారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు జరుగుతుందంటూ స్పీకర్ ప్రకటించారు. కానీ ముందుగా తాము

2 లో

## హిల్ట్ పాలసీపై విపక్షం అవాస్తవాలు ప్రచారం

- గతంలో బిఆర్ఎస్ హయాంలో ఇచ్చిన జివో అమలు
- కాలుష్య నియంత్రణకు పరిశ్రమలు తరలిస్తున్నాం: శ్రీధర్ బాబు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,డిసెంబర్1 : హిల్ట్ పాలసీపై విపక్షం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదని స్పష్టం చేశారు. పట్టాలు ఉండి.. సొంత భూములు ఉన్నవారికే కన్వర్షన్ ఫీజు పెట్టామని తెలిపారు. గత సర్కారే ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే జీవో ఇచ్చిందన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో ప్రభుత్వ భూములపై యాజమాన్య హక్కులను పారిశ్రామికవేత్తలకు ఇచ్చే జీవో తీసుకొచ్చారు. ఖాయిలా పడిన పరిశ్రమల భూములను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నమే

2 లో

## గ్లోబల్ సమ్మిట్‌కు పక్కాగా ఏర్పాట్లు

- అధికారులకు సిఎస్ రామకృష్ణారావు ఆదేశం

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, డిసెంబర్ 1 : ఈనెల 8, 9 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, సబ్యసాచి ఘోష్, సంజయ్ కుమార్, సి.ఎం.ఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితర ఉన్నతాధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. సందర్భంగా సి.ఎస్

2 లో

## విద్యుత్‌లో రూ.50వేల కోట్ల స్కాంకు తెర

- కొత్త డిస్కమ్..థర్మల్ ప్లాంట్‌ల నిర్మాణంలో కమిషన్లు
- విద్యుత్ శాఖను ఎపి ప్రభుత్వం నడుపుతోందా?
- ఎన్టీపిసి తక్కువ రేట్లకే విద్యుత్ ఇస్తామంటే తీసుకోరా
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, డిసెంబర్ 1 : విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఇప్పటికే ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఉండగా కొత్త డిస్కమ్ ఎందుకని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్షన్‌లోనే రేవంత్ యాక్షన్ చేస్తున్నారని ఆరోపించారు. కమిషన్లను దండుకునేందుకే ఇలాంటి స్కామ్‌లకు తెరదీశారు. ఇలా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ రూ. 50వేల కోట్ల స్కాంకు తెరలేపిందని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. థర్మల్ విద్యుత్‌ను తగ్గిస్తామన్న ప్రభుత్వం.. కొత్త ఎలాంట్లు ఎందుకు నిర్మిస్తోందని ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అధికారులను అవమానించిన కుమార్ రాజాను వెంటనే తరిమికొట్టాలని హెచ్చరించారు. అండర్ గ్రౌండ్ కేబుల్స్, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ కరెంట్ సహా ఇంటర్‌స్టేట్ స్కామ్‌నూ త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతాం అని

2 లో

# గ్లోబల్ సమ్మిట్‌కు పక్కాగా ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి

రామకృష్ణా రావు మాట్లాడుతూ, ఈ సమ్మిట్ లో పాల్గొనే ప్రముఖులకు, దేశ, విదేశీ అతిథులకు ఆహ్వానాలు పంపించడం జరుగుతోందని, ఈ సమ్మిట్ కు హాజరయ్యే వారికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేయాలని అన్నారు. ఈ సమ్మిట్ ఏర్పాట్లపై ప్రత్యేకంగా ప్రజా భవన్ లో వార్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో నిర్వహిచే అతిపెద్ద సమ్మిట్ లో రాష్ట్రానికి చెందిన అన్నిశాఖలు తమ పురోగతిని షో కేస్ చేయాలన్నారు. ప్రధానంగా ఫ్యూచర్, గౌరవ ముఖ్యమంత్రి చే వన్ టు వన్ సమావేశాలు, వివిధ సంస్థలచే ఎం.ఓ.యూ. లనే ప్రధాన అంశాలుంటాయని తెలిపారు. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పెద్ద ఎత్తున ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉన్నాయని పేర్కొన్నారు. డిసెంబర్ 13 తేదీ వరకు ఈ సమ్మిట్ కొనసాగుతుందని, 13 న ఉప్పల్ స్టేడియంలో ఫుట్ బాల్ మ్యాచ్ తో ముగుస్తుందని వెల్లడించారు.

# అనుమానాస్పద స్థితిలో యువజంట మృతి

మొదటి పేజీ తరువాయి

స్పందించలేదు. దీంతో కిటికీ నుంచి తలుపు గడియ తీసి లోపలికి వెళ్లారు. ఓ గదిలో అతడి కుమార్తెతో పాటు మరో గుర్తు తెలియని యువకుడి మృతదేహాలను చూశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆ యువకుడు యువతిని హత్య చేసి ఆ తర్వాత తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

# తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయండి

మొదటి పేజీ తరువాయి

మధ్య చర్చ సాగింది. గతంలో అత్యధిక వడ్డీ రేటుతో ఇచ్చిన రుణాలకు సంబంధించి రుణ పునర్వ్యవస్థీకరణ (లోన్ రీకన్‌స్ట్రక్షన్) అంశాన్ని సీఎం హడ్కో ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై హడ్కో ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. సానుకూల వృద్ధి రేటుతో ఉన్న తెలంగాణలో ప్రాజెక్టులకు తక్కువ వడ్డీరేటుతో దీర్ఘ కాల రుణాలు ఇవ్వాలని సీఎం కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే రుణాలు మంజూరు చేశామని హడ్కో ఛైర్మన్ సీఎం రేవంత్ రెడ్డికి తెలియజేశారు. మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రుణాలు వేగంగా మంజూరు చేయాలని సీఎం కోరగా ఛైర్మన్ కుల్‌శ్రేష్ఠ సానుకూలంగా స్పందించారు. ఈ నెల 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న భారత్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని హడ్కో ఛైర్మన్‌ను సీఎం ఆహ్వానించారు. మావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్, హడ్కో రీజినల్ చీఫ్ పి.సుభాష్ రెడ్డి, హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్లు ఆశీష్ గుండాల, సయ్యద్ రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# విపక్షాల ఆందోళన... వాయిదాల పర్వం...

మొదటి పేజీ తరువాయి

ప్రతిపాదించిన సమస్యలపై చర్చ జరగాలంటూ విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అన్ని అంశాలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నమని స్పీకర్ ఓం బిర్లా విపక్షాలకు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రశ్నోత్తరాలకు సహకరించాలంటూ విపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. కానీ విపక్ష సభ్యులు మాత్రం ముందుగా తాము ప్రతిపాదించిన అంశాలపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. దీంతో విపక్ష ఎంపీల తీరుతో స్పీకర్ ఓం బిర్లా తీవ్ర అసహనం చెందారు. ఈ సభను మధ్యాహ్నం 12.00 గంటకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమయం లో సైతం విపక్ష ఎంపీ తీరు అదే విధంగా ఉండడంతో.. తిరిగి సభను మధ్యాహ్నం 2.00 గంటలకు మరోసారి స్పీకర్ వాయిదా వేశారు. మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి బాధ నుంచి ప్రతిపక్షాలు బయటకు రాలేదంటూ ప్రధాని మోదీ చేసి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. పార్లమెంట్‌లో ప్రజాసమస్యలు లేవనెత్తడం డ్రామా కాదని ఆమె పేర్కొన్నారు. విమర్శకుల నోరు మూయిస్తున్నారంటూ కేంద్రంపై ప్రియాంకాగాంధీ మండిపడ్డారు.

# హిల్ట్ పాలసీపై విపక్షం అవాస్తవాలు ప్రచారం

మొదటి పేజీ తరువాయి

హిల్ట్ పాలసీ. ప్రభుత్వ భూమిపై హక్కును బదిలీ చేస్తున్నామనేది అబద్ధం. హిల్ట్ పాలసీలో ఎస్ఆర్‌వో రేటు కంటే ఎక్కువ ఫీజు నిర్ణయించాం అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఇందులో రైతులకు సంబంధించిన భూములు లేవన్నారు. ఇకపోతే బిఆర్ఎస్ తెచ్చిన జీవోనే తాము ముందుకు తీసుకుని వెళుతున్నామని అన్నారు. నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడాలన్న ఉద్దేశ్యంతోనే నగరంలో బాలానగర్, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న పరిశ్రమలను ఓఆర్ఆర్‌కు ఆవలకి తరలిస్తున్నామని అన్నారు.

# చురుకుగా మేడారాం అభివృద్ధి పనులు

మొదటి పేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయ పనులపైన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఆలయ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దని సూచించారు. మేడారం ఆలయ నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దని ఆదేశించారు. గద్దెల సమీపంలో వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గద్దెల దగ్గర నాలుగు వైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. గద్దెలకు గ్రాండ్ లుక్ వచ్చేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత

మొదటి పేజీ తరువాయి

వీరన్న ఆత్మహత్య అత్యంత బాధాకరం. పురుగుల మందు తాగుతూ.. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నా అని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి చేసిన మోసాలకు నిదర్శనం. వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్యనే. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని ఫలితంగా బతుకులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ. 15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేయడం దుర్మార్గం. పండించిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రైతులు బలవుతున్నారు. సెల్ఫీ వీడియోలో వీరన్న చెప్పిన మాటలకైనా ఈ ప్రభుత్వానికి చలనం వస్తుందా? ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారు? మీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటారు? రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రైతులెవరూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని చేతులు జోడించి విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటం చేద్దాం.. మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. వచ్చేది కేసీఆర్ గారి ప్రభుత్వమే.. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయి... ఎవరూ అధైర్యపడకండి అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ట్వీట్ చేశారు.

# ఓటమిని కూడా అంగీకరించలేని విపక్షం

మొదటి పేజీ తరువాయి



సహకరించాలి. సభా సమయాల్లో డ్రామాలు వద్దు. చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి. దేశ ప్రగతి కోసం పార్లమెంటులో మంచి చర్చలు కొనసాగాలి. వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. పరాజయం కూడా ఒప్పుకునే మనసు విపక్షానికి లేదు. మేము మాత్రం విపక్షాలను కలుపుకొని ముందుకెళ్తాం. దేశాభివృద్ధి కోసం విపక్షాలు కూడా మాతో కలిసి రావాలి. అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నాను. దేశ ప్రగతి కోసం సలహాలు, సూచనలు ఇవ్వాలి. కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి' అని ప్రధాని పేర్కొన్నారు. బిహార్ ఓటమి నుంచి ఇంకా బయటకు రాలేదంటూ ప్రతిపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ చురకలంటించారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ ఇండి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన సూచించారు. మీ బాధ్యతను మీరు నిర్వర్తించండంటూ ఆయా పార్టీలకు ప్రధాని హితవు పలికారు. పార్లమెంటులో బలమైన అంశాలతోపాటు ప్రశ్నలు లేవనెత్తండంటూ వారికి కీలక సూచన చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం అంటే ఈ రోజు నుంచి ప్రారంభమమ్యాయి. తమ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి అని వివరించారు. అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని తాను ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో అన్ని అంశాలపై చర్చలు సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను. దేశ ప్రగతి కోసం మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలని చట్టసభ సభ్యులను విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలి. కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి. నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలకు అడ్డుతగలవద్దని కోరుతున్నాను. విపక్షాలు ఓటమి నిరాశను అధిగమించాలి. అవి తమ బాధ్యతను నిర్వర్తించాలి. బలమైన అంశాలను లేవనెత్తాలి అని మోదీ సూచించారు. గత పదేళ్లుగా ప్రతిపక్షాలు ఆడుతున్న ఆట దేశ ప్రజలకు ఇక ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వారు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. వారికి కొన్ని టిప్స్ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను అని ప్రధాని విపక్షాలకు చురకలంటించారు. జీఎస్టీ సంస్కరణల తర్వాత ప్రజలు సంతోషంగా ఉన్నారని మోదీ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని వెల్లడించారు. వికసిత్ భారత్ లక్ష్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈసారి పార్లమెంట్ సెషన్ కూడా దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు బాటలు పరుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశాలు ప్రారంభంకాగా, ఇవి ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సెలవు రోజులు మినహా మొత్తం 15 రోజులపాటు ఈ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ఆమోదం పొందనున్నాయి. ఈ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కేంద్రం కోరింది. ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంట్ సజావుగా సాగేందుకు సహకరించాలని, ఆటంకాలు సృష్టించ వద్దని విపక్షాలను కోరామన్నారు. దాదాపు గంటన్నర పాటు ఈ అఖిలపక్ష భేటీ జరిగింది. ఈ భేటీలో విపక్షాల డిమాండ్లు విన్నారేగానీ ఏమాత్రం స్పందించలేదని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు. అఖిల పక్ష సమావేశానికి కేంద్ర మంత్రులు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘవాల్, ఎల్.మురుగన్, అనుప్రియ పటేల్‌తోపాటు జైరామ్ రమేశ్ (కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ), మిథున్‌రెడ్డి (వైసీపీ), సురేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), బాలశౌరి (జనసేన) సహా 36 పార్టీల నుంచి దాదాపు 50మంది నేతలు పాల్గొన్నారు. కృష్ణా జలాల వినియోగం, కేటాయింపులపై పార్లమెంట్‌లో చర్చించాలని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల అంశాన్ని పరిష్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్ తెలిపారు.

# కారులో కుక్కతో పార్లమెంట్‌కు రేణుకాచౌదరి

## అభ్యంతరం చెప్పిన బిజెపి ఎంపిలు

(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, డిసెంబర్ 1 : పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజైన సోమవారంనాడు ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి కారులో ఒక కుక్కను పార్లమెంటు ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఇది గమనించిన భద్రతాసిబ్బంది ఆ కుక్కను తిరిగి ఆమె నివాసానికి పంపేశారు. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పించింది. ఇది ఎంపీలకు ఇచ్చిన ప్రత్యేక అధికారాలను దుర్వినియోగం చేయడమమే అవుతుందని విమర్శించింది. అయితే దీనిపై రేణుకా చౌదరి ఘాటుగా స్పందించారు. 'ఒక మూగజీవి కారులో ఉంటే వారికి ఎందుకు అంత ఇబ్బంది? దీనిపై ఏదైనా చట్టం ఉందా? నేను వస్తుండగా దారిలో ఒక స్కూటరు, కారు ఢీకొన్నాయి. చిన్న కుక్క రోడ్డుపై తిరుగుతోంది. దానికి దెబ్బతగిలి ఉంటుందని అనిపించి దానిని కారులో ఎక్కించుకున్నాను. నేరుగా పార్లమెంటుకు వచ్చాను. వెంటనే దాన్ని వెనక్కి పంపించేశాను. కారు వదిలిపెట్టినట్టే కుక్క విషయంలోనూ చేశాను. దీనిపై చర్చించేదేముంది? కుక్కపిల్ల ఎవరినీ కరవదు. నిజంగా కాట్లు పడిన వారు పార్లమెంటులో కూర్చున్నారు. వాళ్లు ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. మేము మూగజీవాలను ప్రేమిస్తాం. పార్లమెంటులో కూర్చుని ప్రతిరోజూ మాపై విరుచుకుపడే వాళ్ల గురించి మేము మాట్లాడదలచు కోలేదని అన్నారు. రేణుకాచౌదరి చర్యను బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ తప్పుపట్టారు. పెంపుడు జంతువులను పార్లమెంటుకు తీసుకురావడం ఎంపీలకు ఇచ్చిన ప్రత్యేక హక్కులను దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. జవాబుదారీతనం అనేది తప్పనిసరిగా ఉండాల్సిందేనని పేర్కొన్నారు.

# విద్యుత్‌లో రూ.50వేల కోట్ల స్కాంకు తెర

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ.50 వేల కోట్ల స్కాంను బయటపెట్టినందుకే తనను టార్గెట్ చేస్తున్నారని హరీశ్ రావు అన్నారు. థర్మల్ విద్యుత్ ను తగ్గిస్తామని చెప్పి కొత్త ప్లాంటు ఎందుకు కడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. కమీషన్ల కోసమే కొత్త థర్మల్ ప్లాంట్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. రూ.10,800 కోట్లతో జెన్కో డీపీఆర్ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్టీపీసీ వాళ్లు రూ. 4.12 పైసలకు యూనిట్ ఇస్తామంటే ప్రభుత్వం ముందుకు రాలేదన్నారు .ఎన్టీపీసీ 2400 మెగావాట్ల విద్యుత్ ఇస్తామంటే ఎందుకు ముందుకు రావట్లేదని ప్రశ్నించారు. రామగుండం కొత్త థర్మల్ ప్లాంట్ తో రోజూ ప్రజలపై రూ. 9 కోట్ల భారం పడుతుందని చెప్పారు. 25 ఏండ్లకు కొత్త ప్లాంట్ తో ప్రజలపై రూ. 82 వేల కోట్ల భారం పడుతుందన్నారు. తక్కువ ధరకు వచ్చే విద్యుత్ ను ఎందుకు వద్దంటున్నారని ప్రశ్నించారు. రూ.82 వేల కోట్ల భారం ప్రజలెందుకు భరించాలన్నారు హరీశ్. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే కరెంట్ లో ఈ దుస్థితి వచ్చిందన్నారు. విద్యుత్ శాఖలో తెలంగాణ ప్రాంత అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కమీషన్ల కోసమే కొత్త విద్యుత్ ఎ÷-లాంట్లు నిర్మిస్తున్నారని ఆరోపణలు చేశారు. ఎన్టీపీసీ.. రూ.4.12పైసల్లకు యూనిట్ విద్యుత్ ఇస్తామంటే తీసుకోవడానికి కాంగ్రెస్ సర్కార్ ఎందుకు ముందుకు రావట్లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్టీపీసీ 2,400 మెగావాట్ల విద్యుత్ ఇస్తామంటే ఎందుకు ముందుకు రాలేదు? అని నిలదీశారు హరీశ్‌రావు. ఎన్టీపీసీ ఇచ్చే తక్కువ ధర కరెంటును కాదని.. సొంతంగా విద్యుత్ ప్లాంట్లు ఎందుకు ఏర్పాటు చేస్తామని అంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే విద్యుత్ రంగంలో ఈ దుస్థితి నెలకొందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖను తెలంగాణ ప్రభుత్వం నడుపుతుందా..? లేదా ఏపీ ప్రభుత్వం నడుపుతుందా? అని ఎద్దేవా చేశారు. విద్యుత్ శాఖలో తిష్టవేసుకుని కూర్చున్న ఆంధ్ర ప్రాంత అధికారులను వెంటనే సాగనంపాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్పంచ్ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ఓటర్లను సీఎం పరోక్షంగా ప్రభావితం చేస్తుంటే.. ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. గ్రామాల్లో ఎన్నికలు జరుగుతుంటే.. పట్టణాల్లో సీఎం తిరుగుతానంటే ఎలా అని నిలదీశారు హరీశ్‌రావు.

# పాలమూరు బిడ్డగా ఈ గడ్డను అభివృద్ధి చేస్తా

మొదటి పేజీ తరువాయి

రామకృష్ణారావు సీఎం అయ్యారు. ఆ తర్వాత 75 ఏళ్లలో ఎవరూ కాలేదు. ఇన్నాళ్లకు పాలమూరు బిడ్డ రాష్ట్ర సీఎంగా మీ ముందు నిలబడ్డారు. పాలమూరుకు ఏది కావాలన్నా చేసి మీ రుణం తీర్చుకుంటానని అన్నారు. దశాబ్దాలుగా పాలమూరు జిల్లా కరవు, వలసలకు మాత్రమే పేరు పొందింది. ఇక్కడి నుంచి ఎంపీగా చేసిన మాజీ సీఎం కెసిఆర్ కూడా ఈ జిల్లాకు ఏం చేయలేదు. ప్రాజెక్టులను పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. ఈసారి పాలమూరు బిడ్డను ప్రజలు గెలిపించి అధికారం కట్టబెట్టారని సీఎం రేవంత్ అన్నారు.

కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ఆ అప్పులు తీరుస్తూనే.. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధిని అడ్డుకునే వాళ్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించొద్దు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవాళ్లను గెలిపిస్తే.. గ్రామం అభివృద్ధి చెందదు. మంత్రుల వద్దకు వెళ్లి గ్రామానికి నిధులు అడిగే నేతలను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలి. ఈసారి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించాం. పదేళ్లు నిర్లక్ష్యానికి గురైన నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాం. ఈ ప్రాజెక్టుపై కేసులు వేసి అడ్డుకున్నారు. రైతులు నష్టపోవద్దని ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చేందుకు ముందుకొచ్చాం. పాలమూరు జిల్లాలో కృష్ణానది పారుతున్నా.. ఇక్కడి నేలకు నీళ్లు అందలేదు. మాయగాళ్ల మాటలు విని.. ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌లను ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నాం అని సిఎం రేవంత్ అన్నారు. మక్తల్ పర్యటనలో భాగంగా రూ.200 కోట్లతో సమీకృత గురుకుల పాఠశాల సముదాయ భవనాలు, మక్తల్- నారాయణపేట మధ్య నాలుగు లైన్ల రోడ్డు, మక్తల్‌లో క్రీడాభవనం తదితర అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతకుముందు వనపర్తి జిల్లా ఆత్మకూరులో పర్యటించారు. రూ.151.92 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జూరాల దిగువన హైలెవల్ వంతెన నిర్మాణం, ఆత్మకూరు మున్సిపాలిటీలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన తర్వాత కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే.. ఆటోడ్రైవర్లను మాజీ మంత్రి కేటీఆర్ అండ్ కో రెచ్చగొట్టి తమ మీదకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు సీఎం. తమ ప్రభుత్వంలో పేదలకు కూడా సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తుచేశారు. మహిళలను వ్యాపార వేత్తలుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి పాలమూరును ఆదర్శంగా మారుస్తామని వివరించారు. ఎన్ని నిధులు కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధమని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వంలో ఇరిగేషన్‌తో పాటు ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి పేద బిడ్డకు చదువు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళ్లు ప్రారంభించామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటిదాకా మక్తల్ నారాయణపేట కొడంగల్‌కు సాగునీరు ఇవ్వాలని ఎవ్వరికీ అనిపించలేదు. కానీ 12 మందిని మీరు ఆశీర్వదించి పంపిస్తే నాకు ఇక్కడి ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది. మన కష్టాలను తీర్చేందుకు ఎవ్వరూ బాధ్యత తీసుకోలేదు. కానీ మీ సోదరుడిగా.. మీతో పాటు పెరిగిన బిడ్డగా సీఎంగా వచ్చాను. పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది. కానీ మోసగిస్తే పాతాళానికి తొక్కింది.. ఇది కేసీఆర్ విషయంలో జరిగింది. గతంలో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి.. సీఎంగా చేస్తే.. మన జిల్లాలో ఎలాంటి ప్రాజెక్టు పూర్తి చేయలేదు. రూ.12 కోట్లు కేటాయించి సంగంబండ రిజర్వాయర్ పూర్తి చేయలేదు. అందుకే ఎవరికో పెద్దరికం ఇవ్వొద్దని.. మన బిడ్డ సీఎంగా ఉండాలని మీరు కోరుకున్నారు. మంత్రి మండలి సహకారంతో.. ఇక్కడ అన్ని ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తున్నాం.. గతంలో జీవో నెంబరు- 69 ద్వారా వచ్చిన నారాయణపేట - కొడంగల్ ప్రాజెక్టును పక్కన పెట్టారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తున్నాం. ఇప్పటికీ కొంతమంది అడ్డంకులు పెట్టారు.. కానీ మా మంత్రి వాకిటి శ్రీహరి రైతులతో మాట్లాడి.. ఎకరానికి రూ.20 లక్షల పరిహారంతో 95 శాతం మంది రైతులు భూములు ఇవ్వడానికి ఒప్పుకోవడంతో పనులు ప్రారంభించాం. ఇది నా జీవితంలో చాలా సంతోషకరమైన విషయం. రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం.. ఈ ప్రాజెక్టుకు ఎవరైనా అడ్డుపడితే ఊరుకోం' అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. 'విద్యాభివృద్ధి కూడా ముఖ్యం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రూ. 200 కోట్లతో ఏర్పాటు చేశాం. యెన్నం శ్రీనివాస్ రెడ్డి అడిగిన వెంటనే ట్రిపుల్ ఐటీ కాలేజీ తెచ్చాం.. పాలమూరు విశ్వవిద్యాలయంలో కావాల్సిన కోర్సులన్నీ తెచ్చా.. పాలమూరు జిల్లా విద్యాపరంగా రాష్ట్రానికి మోడల్‌గా ఉండాలి. సన్నబియ్యం, ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్సు అన్నీ అమలు చేస్తున్నాం.. ఇది చాలదన్నట్లు మా ఆడబిడ్డలు పెట్రోల్ బంకులు, వెయ్యి బస్సులకు యజమానులు అయ్యారు. అంబానీ, అదానీలకు సమానంగా హై టెక్ సిటీలో మా అక్కలకు స్టాల్స్ వచ్చాయి. మీరు ఒక్కసారి ఆశీర్వదిస్తే ఇవన్నీ సాధ్యమయ్యాయి. అందుకే మాకు అండగా ఉన్న పాలమూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. మా మాదిగ సోదరులు వర్గీకరణ కోసం చేయని పోరాటంలేదు.. కానీ సుప్రీంకోర్టు తీర్పు వెంటనే నేను వర్గీకరణ చేసి మాల, మాదిగ పంచాయితీ లేకుండా చేసి చూపించా. బీసీ లెక్క చేసి.. దేశానికి ఆదర్శంగా నిలిచాం. సంక్షోభం దిశలో ఉన్న రాష్ట్రాన్ని సక్కగా చేస్తున్నా. స్థానిక ఎన్నికలపై మాట్లాడుతూ.. కాళ్లల్లో కట్టెలు పెట్టే వారిని సర్పంచులుగా గెలిపిస్తే.. మళ్లీ అడ్డంకులు సృష్టిస్తారు. డిసెంబరు 8, 9వ తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ పెట్టుకుని.. మన తెలంగాణ రాష్ట్ర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుదాం. ఇన్ని చేస్తుంటే.. మీరు సర్పంచులుగా వేరే వారిని గెలిపిస్తే.. అభివృద్ధిని అడ్డుకుంటారు. పార్టీలను పదేళ్లు పక్కన పెడదాం.. మన పాలమూరును అభివృద్ధి చేసుకుందాం. ఈ గడ్డ దేశానికి జైపాల్‌రెడ్డి లాంటి నాయకుడిని.. మనకు బూర్గుల రామకృష్ణారావు లాటి తొలి సీఎంను ఇచ్చింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే మమ్మల్ని గెలిపించారో.. ఇప్పుడు సర్పంచులుగా కాంగ్రెస్ నేతలను ఆశీర్వదించి.. మన ప్రభుత్వ అభివృద్ధిని కొనసాగించాలి. మీ అందరి ఆశీర్వాదం తీసుకుని తెలంగాణ రాష్ట్రం మొత్తం తిరుగుతా' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



## మంథని లో ఘనంగా గీతా జయంతి ఉత్సవం..

మంథని. డిసెంబర్ 1(ఆకాంక్ష) : మంథనిలో విశ్వ హిందూపరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తా స్వగృహంలో గీతా జయంతి సందర్భంగా ఘనంగా హిందూ బంధువులు అందరి సమక్షంలో భగవద్గీత ఉత్సవం జరుపుకున్నారు. మంథనిలోని ప్రతి ఇంటికి భగవద్గీత చేరాలనే సంకల్పంతో పలువురికి భగవద్గీతా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంథని విశ్వ హిందూ పరిషత్ ప్రకండ ఉపాధ్యక్షులు రావుల సతీష్, ప్రధాన కార్యదర్శి బత్తుల సత్యనారాయణ, సత్సంగ ప్రముక రాజమౌళి గౌడ్, మట్ మందిర్ ప్రముక కొమురవెల్లి హరీష్ గుప్తా, సోషల్ మీడియా తూర్పాటి రాము, మాతృ శక్తి అధ్యక్షులు రావికంటి రేణుక, సభ్యులు గుండా శ్రీనివాస్, బొడ్డు వెంకటేష్, బెజ్జంకి డిగెంబర్, బండారి ప్రసాద్, వడ్ల కొండ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## మంథని తహసిల్దార్ గా మహమ్మద్ అరీపుద్దీన్



మంథనిరూరల్. డిసెంబర్ 1(ఆకాంక్ష) : మంథని ఎమ్మార్వో గా విధులు నిర్వహించిన కుమారస్వామి కలెక్టరేట్ సి సెక్షన్ కు బదిలీ కాగా మంథనికి తహసిల్దార్ గా మహమ్మద్ అరీపుద్దీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి కలెక్టరేట్ భూ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ అరీపుద్దీన్ ను మంథని తహసీల్దార్ గా బదిలీ చేస్తూ జిల్లా పరిపాలనాధికారి ఉత్తర్వులు జారీ చేశారు

## సంక్లిష్టమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



మంథని. డిసెంబర్ 1(ఆకాంక్ష) : జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సంక్లిష్టమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంజపడుగు, రచ్చపల్లి గ్రామాలలోని సంక్లిష్టమైన పోలింగ్ కేంద్రాలను సోమవారం సిపి సందర్శించి శాంతిభద్రతల పరంగా తీసుకోవాల్సిన పలు సూచనలను సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి ఉద్రిక్తమైన వాతావరణం ఏర్పడకుండా అవసరమైన అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు భయభ్రాంతి లేకుండా తమ ఓటు హక్కును వినియోగించే వాతావరణం కల్పించడానికి పోలింగ్ రోజు ఎలాంటి అక్రమాలు, ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు భయభ్రాంతులు లేకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలీస్ తరుపున అన్ని భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, చట్టవ్యతిరేక చర్యలు ఎవరు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. స్థానిక ప్రజలకు, అన్ని పార్టీల కార్యకర్తలకు శాంతి భద్రతలు, చట్టపరమైన నిబంధనలు, ప్రవర్తనా నియమావళిని పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏ సి పి ఎం రమేష్, మంథని సిఐ బి రాజు , మంథని ఎస్ ఐ రమేష్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రం వద్ద అదనపు ఎస్పీ పర్యవేక్షణ



నాగర్‌కర్నూల్. డిసెంబర్ 1(ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ పెద్దముద్దనూరు గ్రామ పంచాయతీ నామినేషన్ కేంద్రం సోమవారం కిక్కిరిసి పోయింది. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, కేంద్రాన్ని అదనపు ఎస్పీ వెంకటే శ్వర్లు స్వయంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలో రాజకీయ వాతావరణం కాస్త ఉత్కంఠభరితంగా మారే అవకాశం ఉన్నందున, కేంద్రంలో బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి అదనపు ఎస్పీ కీలక సూచనలు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలు చట్టాలు ఏ విధంగా అమలు కావాలి, నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులు మరియు వారి అనుచరులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రశాంత వాతావరణాన్ని ఎలా కాపాడాలో అన్న అంశాలపై విస్తృతంగా మార్గనిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. పెద్దముద్దునూరులో ఉదయం నుంచే వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కేంద్రం వద్ద జనసందడి పెరుగుతుండడంతో పోలీసులు శ్రేణులు ఏర్పాటు చేసి, వాహనాలను నిర్దిష్ట స్థలాలకు మళ్లించారు. నామినేషన్ కేంద్రం లోపలికి అభ్యర్థి, రెండు ప్రతినిధులు మాత్రమే అనుమతించేలా స్పష్టమైన ఆదేశాలు అమల్లో పెట్టారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగ. ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా ప్రతీ అభ్యర్థి నామినేషన్ వేయగలిగేలా శాంతి భద్రతలు కట్టుదిట్టం చేశాం అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు నిబంధనలను గౌరవించాలని, ఎవరూ చట్టాన్ని అతిక్రమించే ప్రయత్నం చేయకూడదని సూచనలు ఇచ్చాం అని పేర్కొన్నారు. అభ్యర్థులు కూడా పోలీసుల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. నామినేషన్ కేంద్రంలో నీటి సదుపాయం, వేడి నుంచి రక్షణకు టెంట్లు, వేచి ఉండే వరుసలు వంటి సదుపాయాలన్నీ సక్రమంగా ఉన్నాయని చెప్పారు. సాయంత్రం వరకు నామినేషన్ల నమోదు కొనసాగగా, కేంద్రం వద్ద క్రమశిక్షణతో ప్రజలు, కార్యకర్తలు తిరుగుతూ కనిపించారు. అధికారులు అప్పుడప్పుడూ ప్రకటనలు చేస్తూ నియమాలు వివరించడంతో ఎటువంటి గందరగోళం చోటుచేసుకోలేదు. జిల్లాలో రెండవ విడత నామినేషన్ ప్రక్రియ సజావుగా కొనసాగుతుండగా, పెద్దముద్దునూరులో అదనపు ఎస్పీ పర్యవేక్షణతో శాంతియుత వాతావరణం నెలకొన్నది.

## యాదవుల ఆత్మగౌరవంపై దాడి

### - నిందితులను కఠినంగా శిక్షించాలి
### - అఖిల భారత యాదవ మహాసభ డిమాండ్



పెద్దపల్లిటౌన్,డిసెంబర్ 01(ఆకాంక్ష) : నల్గొండ జిల్లా,తిప్పర్తి మండలం ఎల్లమ్మ గూడెం గ్రామంలో యాదవ కుటుంబానికి చెందిన మామిడి లక్ష్మి, మామిడి గిరి యాదవులపై జరిగిన అవమానకరమైన సంఘటనను అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా యువజన విభాగం తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సాగర్ యాదవ్,ఏఐవైఎం పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధనవేణి రాజేందర్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చీలారపు పర్వతాలు యాదవ్,యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవులు మాట్లాడుతూ నల్గొండ జిల్లా, తిప్పర్తి మండలం, ఎల్లమ్మ గూడెం గ్రామంలో మామిడి లక్ష్మి, మామిడి గిరి యాదవులపై జరిగిన అవమానకర సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులైన బోళ్ళ వెంకటరెడ్డి, ఉట్కూరి సందీప్ రెడ్డిలను కఠినంగా శిక్షించి,వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంఘటనను ప్రోత్సహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మంత్రివర్గం నుండి,కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, అవమానానికి గురైన మహిళను ఏకగ్రీవంగా సర్పంచ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే ప్రతిదాడులకు దిగుతామని యాదవ నాయకులు హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో నిర్ణయించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆధారంగా బీసీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అన్ని పార్టీల నియోజకవర్గ బాధ్యులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు పోసాని శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని లక్ష్మణ్ యాదవ్, జిల్లా కార్యదర్శులు దారవేణి పోచం యాదవ్, మంద భాస్కర్ యాదవ్, రామగుండం యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల రాజేష్ యాదవ్, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు దాడి చంద్రమౌళి యాదవ్, యువజన విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తమ్మినవేని కుమార్ యాదవ్ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, జిల్లా నాయకులు దారవేణి రాజు యాదవ్, గట్టయ్య యాదవ్, కేశవులు యాదవ్, సత్యం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఎయిడ్స్ డే అవగాహన కార్యక్రమం

నాగర్‌కర్నూల్. డిసెంబర్ 1(ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రపంచ ఎయిడ్స్ డే (డిసెంబర్ 1) సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ శ్రీ బాదావత్ సంతోష్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, గైనకాలజీ నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఐసిటిసి కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, అలాగే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఎయిడ్స్ పై అవగాహన పెంచడం, పరీక్షల ప్రాముఖ్యతను గ్రామ స్థాయికి తీసుకెళ్లడం అత్యవసరమని పేర్కొన్నారు. ఎయిడ్స్ నిరోధక కార్యకలాపాల్లో పౌర సమాజం, ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రతీ ఒక్కరూ సమాజంలో అపోహలను తొలగించి, బాధితులకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. గత సంవత్సరంజాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం కింద విశిష్ట సేవలు అందించిన గైనకాలజిస్టులు, వైద్యాధికారులు, నర్సింగ్ ఆఫీసర్లు, ఐసిటిసి కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, అలాగే క్షేత్రస్థాయిలో కృషి చేసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలను కలెక్టర్ స్వయంగా అందజేశారు. అవగాహన కార్యక్రమంలో ఎయిడ్స్ నివారణపై చూపిన ప్రదర్శనలు, ఆరోగ్య శాఖ రూపొందించిన సమాచార పోస్టర్లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారులు టెస్టింగ్, కౌన్సిలింగ్, చికిత్స ముఖ్యతను వివరించారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 1నుంచి వారంరోజులపాటు ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, కౌన్సిలింగ్ శిబిరాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగ సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




## మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

మంథని. డిసెంబర్ 1(ఆకాంక్ష) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథనిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐక్యూఏసి, ఎన్ఎస్ఎస్ మరియు జువాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పరిషయ్య మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన విద్యార్థినీ విద్యార్థులకు ఉండాలని తెలియజేశారు. జువాలజీ అధ్యాపకులు దుర్గం కృష్ణ గారు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమాజంపై ఎయిడ్స్ ప్రభావం గురించిన అంశాల గురించి విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ . లక్ష్మీనారాయణ, చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, ముఖ్య అతిథి డాక్టర్. స్రవంతి, అధ్యాపకులు అమర్నాథ్, ముకుందం, శేఖర్, శ్రీధర్, ఫర్జానా, మానస, బోధ నేతర సిబ్బంది శ్రీనివాస్, రాజు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## తాళ్లపల్లి సంతోష్ గౌడ్ గీతా కార్మికున్ని ప్రభుత్వం ఆదుకోవాలి



మంథని. డిసెంబర్ 1(ఆకాంక్ష) : మంథని మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన గీతా కార్మికుడు సంతోష్ గౌడ్ ఆదివారం ఈత చెట్టు గీస్తుండగా ప్రమాదవశాత్తు నిచ్చెన జారీ పడిపోగా చెయ్యి విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు సంతోష్ గౌడ్ కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాళ్లపల్లి సంతోష్ గౌడ్ అనే గీతా కార్మికుని ప్రభుత్వం ఆదుకోవాలని మల్లెపల్లి గీత కార్మిక సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

## వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం

పెద్దపల్లిటౌన్. డిసెంబర్ 01(ఆకాంక్ష) : డిసెంబర్ 1వ తేదీ వరల్డ్ ఎయిడ్స్ డే పురస్కరించుకుని పెద్దపల్లి లోని సిరి ఫంక్షన్ హాల్ లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన వైద్యాధికారి డా. వాణిశ్రీ మాట్లాడుతూ.. హెచ్ఐవి%–%ఎయిడ్స్ పై సమాజంలో ఇంకా మరింత అవగాహన అవసరమని స్పష్టం చేశారు. ప్రతి వ్యక్తి స్వచ్ఛందంగా హెచ్ఐవి పరీక్షలు చేయించు కోవాలని, నిర్ధారణ మరియు చికిత్స ప్రక్రియలపై ప్రజల్లోని అపోహలను తొలగించు కోవాల్సిన అవసరం ఉందని ఆమె వివరించారు. హెచ్ఐవి వైరస్ నుంచి రక్షణ, ముందస్తు జాగ్రత్తలు, కౌన్సిలింగ్ సేవలపై వివరాలను పాల్గొన్న వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఐసిటిసి కౌన్సిలర్ శ్రీ కట్కూరి శంకర్‌కు హెచ్ఐవి ఎయిడ్స్ రంగంలో ఆయన చూపుతున్న కృషిని గుర్తిస్తూ %జవతీటటఅఫ్ఘవ శీటాూజూ–జూతీవఎఱఖ్ఱశీఅ% ను డా. వాణిశ్రీ గారి చేతుల మీదుగా ప్రదానం చేశారు. సమాజంలో అవగాహన పెంపు, కౌన్సిలింగ్ విధానాల్లో శ్రీ శంకర్ అందిస్తున్న సేవలు ప్రత్యేకమైనవని అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, లైన్స్ క్లబ్ ప్రతినిధులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, వివిధ వైద్యాధికారులు, కాలేజీ విద్యార్థులు, ఐసిటిసి కౌన్సిలర్లు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. హాజరైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్య శాఖ అవగాహన పుస్తకాలు, సంక్షేమ చిట్టాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమం మొత్తం పెద్దపల్లి జిల్లాలో ఎయిడ్స్ నివారణపై అవగాహనను వ్యాప్తి చేసే దిశగా ఆరోగ్య శాఖ చేపట్టిన చర్యలకు కేంద్రబిందువుగా నిలిచింది. ప్రజలందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పరీక్షలు, కౌన్సిలింగ్ సేవలను ఉపయోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.







# నాగర్‌కర్నూల్ జిల్లాలో పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ నిర్వహణ

## - జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్. డిసెంబర్ 1(ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా, పూర్తిగా ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుమిదిని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలతో పాటు ఉన్నతస్థాయి అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణ, తిరస్కరణ, ఉపసంహరణ ప్రక్రియల్లో ఎలాంటి ఆచితూచి లేకుండా వ్యవహరించాలని, ప్రతి దశను పర్యవేక్షిస్తూ పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. నామినేషన్ల పరిశీలనలో ఎర్రర్స్ లేకుండా ప్రతి జిల్లాలో విధానపరమైన పారదర్శకతను పాటించాలని ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపత్ రావు పాటిల్, సాధారణ ఎన్నికల పరిశీలకులు రాజ్యలక్ష్మి, వ్యయ పరిశీలకులు భీమ్లా నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో నామినేషన్ల ప్రక్రియను అత్యంత సజావుగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో సర్పంచ్ పోస్టులకు వచ్చిన నామినేషన్లలో ఏదీ తిరస్కరణకు గురి కాలేదని, వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 3,357 నామినేషన్లు రాగా అందులో 13 నామినేషన్లు మాత్రమే తిరస్కరించబడ్డాయని వివరించారు. అదేవిధంగా ఆరు గ్రామపంచాయతీలకు ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో అవి ఏకగ్రీవం దిశగా వెళ్లే అవకాశముందని చెప్పారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ పూర్తిస్థాయి భద్రతా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు, పోలీసు పహారా, ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ, సమావేశం

## - జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు



పెద్దపల్లిటౌన్.డిసెంబర్ 1(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం నుంచి అయ్యప్ప స్వామి ఆలయం కూడలి మార్గంగా సిరి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఎన్జీఓలు, నెట్‌వర్క్‌లు, సి.బి.ఓలు భారీ సంఖ్యలో పాల్గొని ఎచ్.ఐ.వి./ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం సిరి ఫంక్షన్ హాల్‌లో జరిగిన అవగాహన సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ మాట్లాడుతూ... ఎచ్.ఐ.వి. ఎయిడ్స్ నివారణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ చురుకుగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు, యువతలో వీటి గురించి సరైన అవగాహన పెంచడం అత్యంత ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా, కట్టుబాటుగా జీవించాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. వాడిన సిరింజీల పునర్వినియోగం, డ్రగ్స్ వినియోగం, అసురక్షిత లైంగిక చర్యలు ఎచ్.ఐ.వి. వ్యాప్తికి ప్రధాన కారకాలని ఆమె గుర్తుచేశారు. మగ%-%మగ, ఆడ%-%ఆడ, మగ%-%ఆడ మధ్య అనుసరించే అసురక్షిత లైంగిక చర్యల ద్వారా కూడా ఎచ్.ఐ.వి. సోకే ప్రమాదం అధికంగా ఉంటుందని వివరించారు. రక్త మార్పిడి సమయంలో తప్పని సరిగా రక్తాన్ని స్క్రీనింగ్ చేయించుకోవాలని, సేవింగ్ బ్లేడ్స్‌ను పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా తమ ఆరోగ్యంపై అనుమానం వ్యక్తం చేసిన వెంటనే ఎచ్.ఐ.వి. స్క్రీనింగ్ చేయించుకోవడం మంచిదని అన్నారు. ఎచ్.ఐ.వి. ఉన్నవారు భయాందోళనలకు గురయ్యే అవసరం లేదని, రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఎ.ఆర్.టి. సెంటర్‌లో ఉచితంగా అందించే మందులు క్రమం తప్పకుండా వాడితే వైరల్ లోడ్ తగ్గి, ఆరోగ్యంగా దీర్ఘకాలం జీవించవచ్చని తెలిపారు. ఎచ్.ఐ.వి.%-%టి.బి. ఎచ్.ఐ.వి. ఉన్న వారికి టి.బి. వచ్చే అవకాశం, టి.బి. ఉన్నవారికి ఎచ్.ఐ.వి. వచ్చే అవకాశం ఎక్కువగా ఉండేందున రెండింటి పరీక్షలను సమయానికి చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని ఎన్జీఓలు, సి.బి.ఓలు, నెట్‌వర్క్‌లు మరియు వైద్య సిబ్బంది కలిసి సమగ్ర అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎచ్.ఐ.వి. నివారణలో విశిష్ట సేవలు అందించిన డాక్టర్ సింధూర, కౌన్సిలర్ సత్యానందం, ఎల్.టీ.లు సుకుమార్, రాజేష్ కుమార్, సఫియా, ఎస్.టి.ఎస్. తిరుపతి తదితరులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే వ్యాసరచన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను సత్కరించారు. తెలంగాణ కాళజాతా బృందం ప్రత్యేక పాటలతో ప్రజల్లో అవగాహన కల్పించటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. కె.వి. సుధాకర్ రెడ్డి, డా. ఆర్. రాజమౌళి, లయన్స్ క్లబ్ సెక్రటరీ సత్యనారాయణ, అధ్యక్షుడు రాం కిషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు కె. రాజగోపాల్, ఎ.ఆర్.టి. మెడికల్ ఆఫీసర్ నీలిమ, సి.బి.ఓ. బిక్షపతి, పాజిటివ్ నెట్‌వర్క్ లావణ్య, ఐసిటిసి సూపర్వైజర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు శంకర్, రవి, సత్యానందం, స్థానిక ఎం.ఎల్.హెచ్.పీలు, ఏ.ఎన్.ఎంలు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరియు వొకేషనల్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# జాతీయ కరాటే పోటీల్లో గోదావరిఖని విద్యార్థుల మెరుపు ప్రతిభ

## - రెడ్ డ్రాగన్ కరాటే ఇన్స్టిట్యూట్ నుంచి 25 పతకాల సునామీ...




గోదావరిఖని. డిసెంబర్ 01(ఆకాంక్ష) : విశాఖపట్నం గాజువాక బీసీ రోడ్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27 నుండి 30 వరకు జరిగిన 28వ ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 జాతీయ వేదికపై గోదావరిఖని విద్యార్థులు వెలుగులు విరజిమ్మారు. పెద్దపల్లి జిల్లా పతాకాన్ని ఎగరేసిన రెడ్ డ్రాగన్ కరాటే ఇన్స్టిట్యూట్ డోజో విద్యార్థులు తమ ప్రతిభతో దేశవ్యాప్తంగా కరాటే ప్రేమికులను ఆకట్టుకున్నారు. కటా, కుమితే విభాగాల్లో చూపిన అద్భుత నైపుణ్యంతో పోటీదారులను నిలువరించి 25 పతకాలు సాధించడం ద్వారా రెడ్ డ్రాగన్ జట్టు ప్రతిభ మరోసారి రుజువైంది. పోటీలలో మొత్తం 7 గోల్డ్, 7 సిల్వర్, 11 బ్రాంజ్ పతకాలను కైవసం చేసుకోవడం గోదావరిఖని క్రీడా చరిత్రలో విశేష ఘట్టంగా నిలిచింది.

# ఉత్తమ వైద్యురాలిగా ఎంపికైన డాక్టర్ సృజన

## - కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేత




నాగకర్నూల్.డిసెంబర్ 01(ఆకాంక్ష) : నాగకర్నూల్ జిల్లా పెద్ద ముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సృజనకు అరుదైన గౌరవం లభించింది. ఎయిడ్స్ నిర్మూలనలో చేసిన విశేష సేవలను గుర్తించిన జిల్లా యంత్రాంగం, ఆమెను ఉత్తమ వైద్యురాలిగా ఎంపిక చేసి ప్రశంసా పత్రం మరియు మేమెంటోను సోమవారం జరిగిన కార్యక్రమంలో అందజేసింది. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ ఎయిడ్స్ అవగాహన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. టీఎంహెచ్వో అధ్యక్షతన ఈ కార్యక్రమం భారీ స్థాయిలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణలో అత్యుత్తమ ప్రతిభ చూపిన వైద్యులను గుర్తించి సత్కరించారు. వారిలో డాక్టర్ సృజన నిలదొక్కుకున్న సేవలు ప్రత్యేకంగా ప్రశంసించబడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సకాలంలో వైద్య సేవలు అందించడం, ప్రమాదంలో ఉన్న వర్గాల్లో ఆరోగ్య సూచనలు వ్యాప్తి చేయడం వంటి అంశాల్లో ఆమె చేసిన కృషిని అధికారులు ప్రశంసించారు. జనాభా ఎక్కువగా ఉన్న ముద్దునూరు మండలంలోని పలు గ్రామాలకు ఆమె వ్యక్తిగతంగా వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ప్రాథమిక స్థాయిలోనే వ్యాధి నివారణ పట్ల ఆమె చూపిన కృషి వల్ల అనేక మంది ప్రజల్లో ఎయిడ్స్‌పై అవగాహన పెరిగిందని సమావేశంలో వెల్లడించారు. ఉత్తమ వైద్యురాలిగా అవార్డు అందుకున్న సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ "ఇది వ్యక్తిగత గౌరవంగా కాకుండా మా ఆసుపత్రి సిబ్బంది, గ్రామీణ ప్రజల సహకారానికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నాను. ఇక ముందు మరింత బాధ్యతతో ప్రజాసేవ కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆరోగ్య అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ కిష్టయ్య వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి

## - తెలంగాణ తొలి అమరుడిగా గుర్తించాలంటూ ముదిరాజ్ మహాసభ నాయకుల విజ్ఞప్తి



గోదావరిఖని. డిసెంబర్ 1(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమ తొలి అమరుడిగా పరిగణించబడే పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్ చోప్పరి శంకర్ ముదిరాజ్ హాజరై కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసే రోజుల్లో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కిష్టయ్య చేసిన బలిదానం అపారమైందని పేర్కొన్నారు. 2009 డిసెంబర్ 1న కామారెడ్డి పట్టణం మధ్యలో ఆత్మాహుతి చెందడం ద్వారా ఉద్యమకారుల్లో కొత్త జోష్ నింపారని గుర్తుచేశారు. ఆయన బలిదానం తర్వాత తెలంగాణ ఉద్యమం మరింత వేగం పందుకుని, చివరకు రాష్ట్ర సాకారం అయ్యే దిశగా దూసుకెళ్లిందని వివరించారు. కిష్టయ్య ముదిరాజ్ తెలంగాణ మలిదశ ఉద్యమం తొలి అమరుడని గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తింపు ఇవ్వాలని, ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే హైదరాబాదులోని ట్యాంక్ బండ్‌పై కిష్టయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఈ కార్యక్రమానికి రామగుండం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యం వహించగా, సంఘం అధ్యక్షుడు దబ్బెట శంకర్ ముదిరాజ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర, స్థానిక ముదిరాజ్ సంఘాల నాయకులు సబ్బు మల్లయ్య ముదిరాజ్, సాగంటి శంకర్ ముదిరాజ్, పిడుగు కృష్ణ ముదిరాజ్, తూడి రాజయ్య ముదిరాజ్, శీలం శ్రీనివాస్ ముదిరాజ్, బర్ల మల్లయ్య ముదిరాజ్, పిట్టల అంజయ్య ముదిరాజ్, కేశవేని బిక్షపతి ముదిరాజ్, గుర్రం సురేష్ ముదిరాజ్, చంద్రమౌళి ముదిరాజ్, మహేందర్ ముదిరాజ్, నీలం కుమార్ ముదిరాజ్, మబ్బు వంశీ ముదిరాజ్, గుర్రం ప్రణీత్ ముదిరాజ్, శివ ముదిరాజ్, చింతల రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా మెపా తెలంగాణ కొవ్వొత్తుల ర్యాలీ




హన్మకొండ.డిసెంబర్ 1(ఆకాంక్ష) : హన్మకొండలో తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య 16వ వర్ధంతిని పురస్కరించుకొని మెపా తెలంగాణ (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ సెంటర్ నుండి ఎన్జీఓఎస్ కార్యాలయం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించగా, పెద్ద సంఖ్యలో ముదిరాజ్ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తరువాత మెపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమరుడు కిష్టయ్య చిత్రపటానికి మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ౌ% "పోలీస్ కిష్టయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి" అని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను ప్రభుత్వం గుర్తించాలని, వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని దేవేందర్ ముదిరాజ్ కోరారు. ఉద్యమంలో నష్టపోయిన యువతకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు గోనెల విజేందర్ ముదిరాజ్, మట్టపల్లి సాంబయ్య, కేశబోయిన కోటేశ్వర్ ముదిరాజ్, మత్స్యశాఖ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మట్టపల్లి జగన్, చిరబోయిన అంజన్ రావు ముదిరాజ్, ప్రశాంత్, రాజు, బండి శ్రీను, జనగాం శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రేతర కార్మికులతో నాణ్యత లోపం

### - లోపభూయిష్ట పనులకు మేం బాధ్యత వహించం...
### - తక్కువ ధరలకు పనిచేస్తే నాణ్యత గ్యారెంటీ లేదు...
### -జిల్లా గౌరవ అధ్యక్షులు తాండ్ర సదానందం, జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి రవి



పెద్దపల్లిటౌన్,డిసెంబర్ 01(ఆకాంక్ష) : రాష్ట్రేతర మరియు ఇతర జిల్లాల నుంచి వస్తున్న మార్బుల్ అండ్ టైల్స్ కార్మికుల వల్ల పనుల్లో నాణ్యత లోపాలు ఎదురవుతున్నాయని శ్రీ రాజరాజేశ్వర మార్బుల్ అండ్ టైల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి రవి ఆందోళన వ్యక్తం చేశారు.సోమవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో శ్రీ రాజరాజేశ్వర మార్బుల్ అండ్ టైల్స్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవధ్యక్షులు తాండ్ర సదానందం,జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి భవన యజమానులకు,కార్మికులకు కీలక అంశాలను వెల్లడించారు. యూనియన్‌లో పనిచేసే ప్రతి కార్మికుడు తప్పనిసరిగా యూనియన్ గుర్తింపు కార్డు తీసుకోవాలని, ప్రతి నెలా సమావేశం నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని తాండ్ర సదానందం స్పష్టం చేశారు. ప్రధానంగా,యూనియన్ నిర్ణయించిన ధరలకు మాత్రమే పనులు చేయాలి తప్ప,ఆ ధరలను తగ్గించి పని చేయడం వలన నాణ్యత లోపిస్తుందని ఆయన హెచ్చరించారు.ఇంటి యజమానులు తక్కువ రేటుకు పనిచేసేవారిని ఆశ్రయిస్తే భవిష్యత్తులో రిపేర్లకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. ఈ సమస్యను నివారించేందుకు వచ్చే జనవరి 2026 మాసం నుంచి మార్బుల్ పనులకు కొత్త ధరలను యూనియన్ నిర్ణయిస్తుందని,ఆ ధరల ప్రకారమే యజమానులు పనులు చేయించుకోవాలని కోరారు.పని ఇచ్చేటప్పుడు కార్మికుల వద్ద యూనియన్ కార్డు ఉందా లేదా అని పరిశీలించాలని, యూనియన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి,తక్కువ ధరలకు పని చేయించుకుంటే తలెత్తే సమస్యలకు యూనియన్ బాధ్యత వహించదని ఆయన స్పష్టం చేశారు.జిల్లా అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి మాట్లాడుతూ రాష్ట్రేతర మరియు ఇతర జిల్లాల నుంచి వస్తున్న కార్మికుల వల్ల నాణ్యత లోపాలు ఎదురవుతున్నందున,రాజరాజేశ్వర అసోసియేషన్ యొక్క యూనియన్ కార్డు ఉన్నవారికి మాత్రమే ఇంటి పనులు అప్పగించాలని భవన యజమానులకు విజ్ఞప్తి చేశారు.ఇంటి ఇంటీరియర్ పనిలో నాణ్యత చాలా ముఖ్యమని, లక్షల రూపాయలు వెచ్చించి ఇల్లు కట్టుకునే యజమానులకు లోపాలు ఉన్న పనుల వల్ల ఇబ్బంది కలగకూడదని అన్నారు.ఇటీవల పని నాణ్యత సరిగా లేదని ఫిర్యాదులు అందాయని,యూనియన్‌లో లేని కార్మికులు సగం పనులు చేసి విడిచిపెట్టి వెళ్తున్నారని ఆయన వివరించారు.యూనియన్ కార్డు లేనివారి విషయంలో అసోసియేషన్ ఎలాంటి చర్యలు తీసుకోదని స్పష్టం చేస్తూ, రాబోయే రోజుల్లో,కార్డు లేని కార్మికులు పూర్తి చేసిన భవనాలకు నిర్వహణ పని తమ యూనియన్ సభ్యులు చేయరని,చేయనివ్వరని కరాఖండిగా హెచ్చరించారు.ఇంటి యజమానులు ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కోకుండా ఉ ండేందుకు ఈ నిబంధనలను తప్పక పాటించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా కల్లెపెల్లి మోహన్,సంయుక్త కార్యదర్శి దొమ్మటి రాజేష్,ఉపాధ్యక్షులు గడ్డం మధు,కోశాధికారి గడ్డం తిరుమల్,సహాయ కోశాధికారి లోకేష్ మీనా,ప్రచార కార్యదర్శి మిరియాల రవీందర్ రావుతో పాటు యూనియన్ నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

# రామగుండంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు పునరుద్ధరణ

### - ఎంపీ గడ్డం వంశీకృష్ణ కీలక చర్యలు...



పెద్దపల్లిబ్యూరో. డిసెంబర్ 01(ఆకాంక్ష) : రామగుండం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం గత రెండు సంవత్సరాలుగా జరుపుతున్న కృషిని మరో ముందడుగుకు తీసుకెళ్లినట్లు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఈ విషయం పై అనేకసార్లు సివిల్ ఏవియేషన్ మంత్రి రామ్మోహన్ నాయుడు గారిని ప్రత్యక్షంగా కలిసి మాట్లాడిన విషయాన్ని ఎంపీ గుర్తుచేశారు.మొదట ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిశీలించిన సైట్‌లో కొండలు ఉండటం, అడ్డంకులు ఉండటం వల్ల వారు ఆ లొకేషన్‌ను రిజెక్ట్ చేశారు. కానీ మేము మళ్లీ వారిని ఒత్తిడి చేసి, ప్రీ-ఫీజిబిలిటీ స్టడీని కొత్త లొకేషన్‌పై నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూ. 50 లక్షలు ప్రీ-ఫీజిబిలిటీ స్టడీ కోసం సెంటర్‌కు చెల్లించినట్లు ఎంపీ తెలిపారు. ఈ స్టడీని వేగవంతం చేయడానికి ఈరోజు కూడా సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీలో మంత్రి రామ్మోహన్ నాయుడును మరోసారి కలిసి చర్చలు జరిపినట్లు వంశీకృష్ణ వెల్లడించారు. డిసెంబర్ 3 లేదా 4 తేదీలలో ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా టీమ్ రామగుండం ప్రాంతాన్ని సందర్శించి, కొత్త ల్యాండ్ సర్వే చేస్తుందని ప్రీ-ఫీజిబిలిటీ స్టడీ పూర్తయ్యాక భూసేకరణ, తుది నిర్ణయాలకు వెళ్లే అవకాశం ఉంటుందని ఎంపీ తెలిపారు.ఎయిర్పోర్ట్ స్థాపన వల్ల రామగుండం, సింగరేణి ప్రాంతం పెద్దపల్లి, మంచిర్యాల్, ఆదిలాబాద్ జిల్లాలు సహా మొత్తం పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందని ఎంపీ వంశీకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఇది ఒక భారీ ఆర్థిక అవకాశాన్ని తీసుకొస్తుంది. అందరూ సహకరించాలి. మీ ఆశీర్వాదంతో రామగుండంలో ఎయిర్‌పోర్ట్ వచ్చేవరకు నేను నిరంతరం కృషి చేస్తానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ చెప్పారు.

# బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



పెద్దపల్లిబ్యూరో. డిసెంబర్ 01(ఆకాంక్ష) : పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు చేస్తున్న ప్రజా సేవకు ఆకర్షితులై పెద్దపల్లి మండలం, కాసులపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు వేల్పులమనోహర్, ఆలువాల దామోదర్ రెడ్డి (సింగిల్ విండో మాజీ వైస్ చైర్మెన్), దాసరి చెంద్రశేకర్ రెడ్డి,వంగపల్లి సత్యనారాయణ రెడ్డి,ఆలువాల రాజిరెడ్డి,వేల్పుల సతీష్,బిరుదు మల్లేశం,కంది ఓదెలు,రాపోలు శంకర్,పిండ్యాల జనార్ధన్ రెడ్డి,ఇరుమల్ల హన్మంత్, కూర భూంరెడ్డి,వేల్పుల అంజయ్య, పబ్బతి నారాయణ రెడ్డి, మరాటి లింగయ్య,అవునూరి జితేందర్, అవునూరి సుమన్, మరాటి కనుకయ్య ,అవునూరి అజయ్, గొట్టే మల్లేశం, బొల్లం అంజయ్య , శ్రిరాల రాములు, మరాటి మహేందర్ ,అదెలా రవి, అవునూరి రాజేశం,అవునూరి అనిల్,బొంకురి కొమురయ్య, అవునూరి తిరుపతి ,అవునూరి అరవిందు,గద్దల సతీష్ తో పాటు 100 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ వైస్ చైర్మన్ కూర మల్లారెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు...

# ప్రేమ జంటను కలిపిన సర్పంచ్ ఎన్నికలు

### - తాళ్లపల్లి గ్రామంలో ప్రేమకథ, రాజకీయాల మేళవింపు



మెదక్. డిసెంబర్ 01(ఆకాంక్ష) : సంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి గ్రామంలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికలు ఒక ప్రేమ జంటను జీవితాంతం కలిపేసిన అపూర్వ సంఘటనకు వేదిక అయ్యాయి. సాధారణంగా సర్పంచ్ ఎన్నికలు గ్రామ రాజకీయాల్లో ఎదురు తగాదాలు, గుంపులు, పోటీలు, వ్యూహాలకు ప్రసిద్ధి. అయితే ఈసారి అదే ఎన్నికలు ఇద్దరు యువ హృదయాలకు వివాహ బంధాన్ని కట్టిన చారిత్రక సందర్భంగా మారాయి.ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించిన సర్పంచ్ స్థానం ఈ గ్రామంలో పెద్ద చర్చగా మారింది. ఈ రిజర్వేషన్ సమాచారంతో పాటు గ్రామ రాజకీయాల్లో కొత్త మలుపు తీసుకునే ప్రేమకథ బయట పడింది. తాళ్లపల్లి గ్రామానికి చెందిన బీసీ యువకుడు చంద్రశేఖర్ గౌడ్ కొంతకాలంగా తనకు ఇష్టమైన ఎస్సీ వర్గానికి చెందిన యువతి శ్రీజతో ప్రేమలో ఉన్నాడు. అయితే సామాజిక వర్గాల భేదాలు, కుటుంబాల అనుమతి లేకపోవడం వల్ల ప్రేమజంట వివాహం వాయిదాపడుతూ వచ్చింది. అప్పుడే గ్రామంలో సర్పంచ్ స్థానానికి నోటిఫికేషన్ రావడంతో చంద్రశేఖర్ గౌడ్ ధైర్యంగా ముందుకు వచ్చి తన ప్రేయసి శ్రీజను సర్పంచ్ పోటీలో నిలబెట్టాలని నిర్ణయించాడు. ఆమె అర్హతలను, నాయకత్వ నైపుణ్యాలను నమ్మి, గ్రామ అభివృద్ధికి ఆమె పనిచేస్తుందనే విశ్వాసంతోనే నామినేషన్ వేయించాడు. ఇద్దరి ప్రేమకథతో పాటు ఎన్నికల సందడి కలగలిపి గమ్మత్తైన రాజకీయ వాతావరణం తలెత్తింది.కానీ ఈ విషయం తెలుసుకున్న శ్రీజ తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ వెంటనే ఉపసంహరించుకోవాలని వారు గట్టిగా శ్రీజను కోరినట్లు గ్రామంలో పెద్ద చర్చ నడిచింది. కుటుంబ సభ్యుల ఒత్తిడి పెరుగుతున్న సందర్భంలో, ఇద్దరి ప్రేమను విడదీసే ప్రయత్నాలు సాగుతున్నాయనే భావనతో, ప్రేమజంట రాత్రికి రాత్రే యాదగిరిగుట్టలో వివాహం చేసుకుని ఒకరినొకరు జీవిత భాగస్వాములుగా చేసుకున్నారు. వివాహం అనంతరం శ్రీజ మాట్లాడుతూ..నేను మేజర్‌ని. నా ఇష్టప్రకారమే నా భర్త చంద్రశేఖర్‌ను పెళ్లి చేసుకున్నాను. ఇక మా జీవితంపై ఎవ్వరూ ఒత్తిడి చేయకూడదు. మా నిర్ణయాన్ని అంగీకరించండి" అని తల్లిదండ్రులతో విజ్ఞప్తి చేసింది. అలాగే నా భర్త చంద్రశేఖర్ సహకారంతో సర్పంచ్ ఎన్నికల్లో గెలిచి గ్రామ అభివృద్ధికి కష్టపడతాను. ప్రజలు నాకు ఆశీర్వదిస్తారని నమ్ముతున్నానని ఆమె తెలిపారు.ఈ సంఘటన గ్రామంలోని రాజకీయ నేతల దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు ప్రేమజంట నిర్ణయాన్ని సమర్థిస్తూ వారికి పూర్తి మద్దతును ప్రకటించారు.ప్రేమను గౌరవించే సమాజం అభివృద్ధి దిశగా సాగుతుంది. శ్రీజ అభ్యర్థిత్వానికి మేము అండగా ఉంటామని స్థానిక నాయకులు వెల్లడించారు. ప్రస్తుతం తాళ్లపల్లి గ్రామంలో ఈ ప్రేమ%-%రాజకీయాల కలయిక ప్రత్యేక చర్చగా మారింది. ఒకవైపు ఎన్నికల ప్రచారం మొదలవుతుండగా, మరోవైపు ప్రేమజంట కొత్త జీవితం ప్రారంభించడంతో గ్రామం మొత్తం ఆనందోత్సాహాలతో నిండిపోయింది.గ్రామ పెద్దలు, స్థానికులు, యువతంఅందరూ ఈ ప్రేమజంట ధైర్యాన్ని, నిర్ణయాన్ని అభినందిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికలు ఈసారి కేవలం రాజకీయ పోటీ మాత్రమే కాకుండా, ఇద్దరు యువ హృదయాలను కలిపిన ప్రేమకథకు ప్రతీకగా నిలిచాయి. తాళ్లపల్లి సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఏవిధంగా మలుపుతిప్పుతాయో తెలియాల్సి ఉన్నా%ౌ% గ్రామంలో ప్రేమకథతో కలిసిన ఈ ఎన్నికలు అందరి దృష్టిని ఆకర్షించడం అందరిలోనూ ఆసక్తిగా మారింది.



### కలెక్టరేట్ పరిపాలన అధికారిగా బాధ్యతలు స్వీకరించిన..

# కలెక్టరేట్ పరిపాలన అధికారిగా బండి ప్రకాష్

పెద్దపల్లిటౌన్ ,డిసెంబర్ -01(ఆకాంక్ష) : కారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను మర్యాద పూర్వకంగా కలిశారు.

# గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో భగవద్గీత దినోత్సవ వేడుకలు




పెద్దపల్లిబ్యూరో. డిసెంబర్ 01(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో భగవద్గీత దినోత్సవంను గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ దేవి ఎంతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం భక్తి, ధర్మం జ్ఞానం, విలువలతో నిండిపోయింది.ఈ సందర్భంగా విద్యార్థులు భగవద్గీత 6వ అధ్యాయాన్ని పూర్తిగా చదివి, శ్లోకాలను శుద్ధోచ్చరణతో పారాయణం చేశారు. శ్లోకాల భావం పిల్లలలో ధర్మబోధ, నియమం, ధైర్యం, నైతిక విలువలను పెంపొందించేలా మార్గనిర్దేశనం చేసింది.తెలుగు మేడం సృజన భగవద్గీతలోని ముఖ్య సారాంశాన్ని పిల్లలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన సనాతన ధర్మం, మనిషి జీవితంలో కష్టాలను ఎలా ఎదుర్కోవాలి, ఎలా గుణాలను అలవర్చుకోవాలి, ఎలా ధర్మపథంలో నిలబడాలి అనే సందేశాలను సమగ్రంగా వివరించారు.పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ప్రియాంక నిజ జీవితంలో జరిగిన ఒక ప్రేరణాత్మక కథ ద్వారా సనాతన ధర్మం అర్థం, దాని విలువ, మరియు పిల్లలు పాటించాల్సిన సత్యం, దయ, క్రమశిక్షణ, వినయం వంటి గుణాలను వివరించారు. పిల్లల్లో శ్లోకాలు నేర్చుకునే ఉత్సాహాన్ని అభినందిస్తూ,సందేశాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని పర్వదినాన్ని విజయవంతంగా మార్చారు. భగవద్గీత బోధనలు విద్యార్థుల ఆత్మవిశ్వాసం, నైతికత, వ్యక్తిత్వ వికాసానికి ఎంతో తోడ్పడతాయని వారు అభిప్రాయపడ్డారు.పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందనలు తెలియజేసింది.

# అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



వరంగల్. డిసెంబర్ 01 (ఆకాంక్ష) : వరంగల్ జిల్లాలోని వడ్డేపల్లి గ్రామంలోని ముదిరాజ్ వాడలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. స్థానిక ప్రజల సమస్యలు, రోడ్ల అభివృద్ధి, కాలువల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీ విస్తరణ వంటి విషయాలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, వీటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు మట్టేపల్లి సాంబయ్య ముదిరాజ్, కార్యదర్శి కేశబోయిన కోటేశ్వరరావు ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రాష్ట్ర మత్స్యశాఖ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండల సమ్మయ్య ముదిరాజ్, ముదిరాజ్ మత్స్యశాఖ అధ్యక్షులు మట్టపల్లి నర్సింహం, కార్యదర్శి మట్టపల్లి కోటేశ్వర్, కోశాధికారి మట్టపల్లి శంకర్, సొసైటీ సభ్యులు సదానందం, నటరాజ్, సారయ్య, రామ్‌రాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేని గ్రామ పెద్దలు పూల మాలలతో ఆహ్వానించారు. అనంతరం స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను కేటాయించే ప్రక్రియను పరిశీలిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పర్యటనతో సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక ముదిరాజ్ వాడ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందించాలని నాయకులు కోరారు.

# పెద్దకల్వలలో నోబెల్ స్కూల్‌లో పిటిఎ మీటింగ్ సందడి...




పెద్దపల్లిటౌన్, డిసెంబర్ 01(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా నోబెల్ స్కూల్ పెద్దకల్వలలో నిర్వహించిన పేరెంట్-టీచర్ మీటింగ్ విద్యాసంస్థను సందడిగా మార్చింది. విద్యార్థుల విద్యా అభివృద్ధి, వ్యక్తిత్వ వికాసంలో తల్లిదండ్రుల కీలక పాత్రను ప్రతిపాదిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ఈ సమావేశం ప్రత్యేకతగా నిలిచింది. ఈ సందర్భంగా "పిల్లల్ని పెంచడంలో తల్లిదండ్రుల పాత్ర" అనే అంశంపై వ్యాసరచన మరియు ఉపన్యాస పోటీలను స్కూల్ నిర్వహించింది. అనేకమంది తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలు పంచుకున్నారు. పిల్లల పెంపకంలో అవసరమైన జాగ్రత్తలు, ప్రాథమిక మానవ విలువలు, విద్య పట్ల శ్రద్ధ వంటి అంశాలను వివరిస్తూ వారు తమ అనుభవాలను వ్యక్తం చేశారు. సొసైటీ నిర్మాణంలో విద్యార్థులను ఒక బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం అంతే ముఖ్యమని తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు స్కూల్ ప్రతినిధులు చెప్పారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, ఆలోచనా సామర్థ్యాలు, సామాజిక అవగాహన పెంపొందించే దిశగా పాఠశాల నిరంతరం పని చేస్తోందని వారు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలైన తల్లి దండ్రులకు స్కూల్ పరిపాలన నుంచి ప్రత్యేక బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మీడియా ప్రతినిధులకు పాఠశాల యాజమానం ధన్యవాదాలు తెలిపింది. నోబెల్ స్కూల్ విద్యార్థులను ఉన్నత పౌరులుగా మార్చే దిశగా తల్లిదండ్రులతో కలిసి చేపట్టిన ఈ కార్యాచరణ ప్రశంసలు అందుకుంది.



# మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను సందర్శించిన అమెరికా వైద్య విజ్ఞాన సంస్థ

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిసెంబర్ 1 : ప్రపంచ ప్రఖ్యాతి గడించిన అమెరికాలోని మినిసోటాకు చెందిన వైద్య విజ్ఞాన సంస్థ మయో క్లినిక్‌కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంటిరియాలజిస్టు డా. శాంతి స్వరూప్ వేగి, బృందం ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని లోని మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎంఐఎంఎస్ సందర్శించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి యలమంచలి సత్యన్నారాయణ చౌదరి వైయస్ చౌదరి, ముఖ్య ముఖ్య అతిథులుగా పాల్గొనారు. ఈ సందర్భంగా యలమంచలి సత్యన్నారాయణ చౌదరి వైయస్ చౌదరి మాట్లాడుతూ, ఎన్నో ఒడిదొడుకులను దాటుకొని ఎంఐఎంఎస్ ఈ స్థితికి చేరుకొందని ప్రశంసించారు. కేవలం దనార్జనే లక్ష్యంగా కాకుండా నాణ్యమైన వైద్య సేవలను అవసరమైన వారికి అందించడానికి సంస్థ ఎంతో కృషి చేస్తోందని అన్నారు. రానున్న రోజులలో సంస్థకు మంచి భవిష్యత్తు ఉందని అందరూ కలసి కట్టుగా పని చేయాలని మయో క్లినిక్ లాంటి ప్రపంచ స్థాయి సంస్థలు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు చెందిన అధ్యాపక బృందం తో పాటూ యాజమాన్యం పాల్గొన్నరూ. ప్రత్యేక సమావేశంలో మయో వైద్య విజ్ఞాన సంస్థకు చెందిన ప్రతినిధి బృందం సంస్థకు చెందిన పలు విషయాలపై అవగాహన కలిపించారు. ఈ ప్రత్యేక సమావేశంలో మయో వైద్య అనంతరం మయో క్లినిక్ బృందం, ముఖ్య అతిథి యలమంచలి సత్యన్నారాయణ చౌదరి వైయస్ చౌదరి తో కలసి మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ యొక్క వైద్య కళాశాల, మెడిసిటి హాస్పిటల్ తో పాటూ షేర్ ఇండియా వైద్య పరిశోధనా సంస్థ ప్రాంగణాలను సందర్శించి విశేషాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమాలలో డా. శాంతి స్వరూప్ వేగి, గ్యాస్ట్రో ఎంటిరియాలజిస్టు, మయో వైద్య విజ్ఞాన సంస్థ, డా. వియస్ వి ప్రసాద్, వ్యవస్థాపకులు, లోటస్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ప్రొఫెసర్ కె శివరామ కృష్ణ, ప్రసిడెంట్,డా. దేవేంద్ర సింగ్, ప్రిన్సిపాల్,డా. శైలేంద్ర, వైస్ ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల,హాస్పిటల్ కు చెందిన వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ & డ్రైవ్ కేసులో ఒకరికీ మూడు రోజుల జైలు, ఏడుగురికి రూ.14,000 జరిమానా...



రామగుండం క్రైమ్. డిసెంబర్ 01 (ఆకాంక్ష) : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలలో ఎనిమిది మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. ఈ తనిఖీలు రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. తనిఖీల్లో పట్టుబడిన ఎనిమిది మందిని న్యాయపరమైన చర్యల కోసం గోదావరిఖని సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి వారిలో ఏడుగురు వ్యక్తులకు మద్యం సేవించి వాహనం నడపడం నిర్ధారితమవడంతో ఒక్కొక్కరికి రూ.14,000 చొప్పున జరిమానా విధించారు. అయితే మరో వ్యక్తి గతంలో ఒకసారి ఇదే నేరానికి గురైనట్టు రికార్డుల్లో బయట పడటంతో, ఆయనపై మరింత కఠిన చర్యలు తీసుకుంటూ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ ఆదేశించారు. అనంతరం అతడిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల రహదారులపై ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, ఇలాంటి నేరాలకు కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా వాహనం నడుపుతున్నప్పుడు మద్యం సేవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ప్రత్యేకంగా సూచించారు. రామగుండం కమిషనరేట్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఇలాంటి నిరంతర చర్యల రూపంలో కొనసాగుతాయని ట్రాఫిక్ విభాగం స్పష్టం చేసింది.

# ఘనంగా వరల్డ్ ఎయిడ్స్ డే అవగాహన కార్యక్రమం...



గోదావరిఖని. డిసెంబర్ 01(ఆకాంక్ష) : డిసెంబర్ 1వ తేదీ వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు విధంగా నిర్వహించారు. పెద్దపల్లి పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో జిల్లా డీఎంహెచ్ఓ వాణిశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ గురించి ప్రజలందరూ సరైన అవగాహన కలిగి ఉండాలి. ఇంకా చాలా మంది పరీక్ష చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా హెచ్ఐవి పరీక్షలు చేయించుకుని, అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని ఐసిటిసి కౌన్సిలర్ కట్కూరి శంకర్‌కు, హెచ్ఐవి/ఎయిడ్స్ సేవల్లో చూపిన కృషిని గుర్తిస్తూ "సర్టిఫికేట్ ఆఫ్ అప్రిషియేషన్"ను డీఎంఅండ్ హెచ్ఓ వాణిశ్రీ చేతుల మీదుగా అందజేశారు. సేవలందిస్తున్న ప్రతి కౌన్సిలర్, వైద్య సిబ్బంది నిబద్ధత సమాజానికి ఆదర్శమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, వివిధ వైద్యాధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, ఐసిటిసి కౌన్సిలర్లు, అనేక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎయిడ్స్ నివారణ, జాగ్రత్తలు, కౌన్సిలింగ్ ప్రాముఖ్యత, పరీక్షల లభ్యత, ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించే ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా వరల్డ్ ఎయిడ్స్ డే నిమిత్తం ర్యాలీలు, ఆరోగ్య శిబిరాలు కూడా నిర్వహించగా, పాఠశాలలు కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రామాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

# తెలంగాణ రైజింగ్‌తో ఆర్థికాభివృద్ది సాధ్యమేనా ?

## లక్ష్యాలను అనుకున్నట్లుగా తీసుకెళ్లే సామర్థ్యం ముఖ్యం

హైదరాబాద్, డిసెంబర్ 1 : తెలంగాణలో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్త ఇచేసుకోబో తోంది. ఈ క్రమంలో 'తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్' రూపొందిస్తోంది. భవిష్యత్‌లో చేయబోయే కార్యక్రమాలు. అభివృద్ధిపై ఇందులో ప్రస్ఫుటంగా ప్రస్తావించ నున్నారు. ఏరకంగా ముందుకు వెళుతున్నదీ వివరించనున్నారు. అయితే ఇది అంత ఆషామాషీ విషయం కాదు. ఇప్పటికే నిధుల కొరత, అప్పుల ఊబిలాంటి సమస్యలు ఉన్నాయి. వీటిని అధిగమించాలి. ఇందుకు ఆర్థిక కట్టుబాట్లు కూడా అవసరం. ఇవన్నీ లేకుండా ఇంత పెద్ద లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడం అంత సులువు కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, భవిష్యత్ పాలసీ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రజలకు అంకితం చేయాలని నిర్ణయించింది. తెలంగాణ భవిష్యత్తు కోసం రూపొందిస్తున్న 'తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమిక్ష నిర్వహించారు. ఈ డాక్యుమెంట్‌కు 'రైజింగ్ 2047'గా నామకరణం చేశారు. గతాన్ని అనుభవంగా తీసుకుని, ఆ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటూనే భవిష్యత్‌కు అడుగులు వేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు ప్రకటించారు. పాలసీలలో పెరాల్సిస్ వస్తే రాష్ట్ర భవిష్యత్ తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించారు. ఈ పాలసీ డాక్యుమెంట్ తయారీలో భాగంగా, తాము ఐఎస్‌బీ, నీతి ఆయోగ్ వంటి ప్రముఖ సంస్థల సలహాలు కూడా తీసుకున్నట్లు వెల్లడించారు. విజన్‌లో భాగంగావ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగానే తెలంగాణను మూడు ప్రధాన ఆర్థిక విభాగాలుగా వర్గీకరించారు. తెలంగాణ ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్రంలోని ప్రాంతాలను మూడు విభాగాలుగా విభజించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం అంతా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా పరిగణించబోతున్నారు. గతంలో ఔటర్ లోపలి ప్రాంతంలో ఉన్న నాలుగు విభాగాల గందరగోళం తొలగిపోతుందని, కాలుష్య రహిత నగరంగా ఉండాలంటే ఈ ప్రాంతాన్ని 'క్యూర్' చేయాల్సిందేనని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు బయటి నుండి ఆర్‌ఆర్‌ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీగా గుర్తించారు. 360 కి.మీ. పొడవైన ఆర్‌ఆర్‌ఆర్‌కు కేంద్రం అంగీకారం తెలిపిందని,ఇది నగరానికి రెండో అర్బన్ రీజియన్ గా మారుతుందని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేలతో పాటు, బుల్లెట్ ట్రైన్ వేయడానికి కేంద్రం నుండి అనుమతి తెచ్చామని, హైదరాబాద్-బెంగుళూరు మధ్య కనెక్టివిటీని పెంచి అభివృద్ధిని సిద్ధం చేస్తున్నామని సిఎం రేవంత్ ప్రకటించారు. ఆర్‌ఆర్‌ఆర్ బయటి నుండి తెలంగాణ సరిహద్దు వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీగా గుర్తించారు. ఆదాయం పెంచాలి? పేదలకు పంచాలి అనేది తమ ప్రభుత్వ విధానమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ సమస్య లేకపోయినా, పోషకాహార సమస్య ఉందని, దాన్ని ఎలా పరిష్కారం చేయాలనే దానిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ గ్రామాలకు చేరినప్పటికీ, ఇప్పుడు నాణ్యమైన విద్య, సాంకేతిక విద్య అందించడంపై దృష్టి పెట్టామని, విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. తెలంగాణను 'నాలెడ్జ్ హబ్'గా మారిస్తే, పెట్టుబడులు, కంపెనీలు క్యూ కడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. అంతేకాకుండా, ఎయిర్‌పోర్టుల విస్తరణలో భాగంగావరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలో కొత్త ఎయిర్‌పోర్టులు తెస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇవన్నీసకారాంచేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నదే తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా చెబుతున్నారు. అయితే ఇది ఎంతవరకుసాకారంఅవుతుందన్నదిప్రభుత్వచిత్తశుద్ధిని పట్టి ఉంటుంది.

# విజేతలను అభినందించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

గోదావరిఖని. డిసెంబర్ 01(ఆకాంక్ష) : జాతీయస్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను గోదావరిఖని ఎమ్మెల్యే మక్కాన్స్ సింగ్ రాజ్ ఠాకూర్ సోమవారం తన క్యాంప్ ఆఫీస్‌లో ప్రత్యేకంగా సత్కరించారు. గోదావరిఖని నుంచి ఇలాంటి ప్రతిభావంతుల విజయం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని, భవిష్యత్తులో కూడా విద్యార్థులు ఇంకా ఉన్నత స్థాయిలో మెరవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ మొండయ్య, సీనియర్ కోచ్ క్రాంతి కుమార్, తల్లిదండ్రులు, స్థానిక క్రీడాభిమానులు పాల్గొన్నారు.



# ఆరోగ్యం

## షుగర్ ఉన్న వారికి ఈ పువ్వు సంజీవని లాంటిది.. ఒక్కటి తింటే, చిటికెలో షుగర్ మటుమాయం!



ఇప్పుడు మెజారిటీ ప్రజలను ఇబ్బంది పెడుతున్న, చాలా మందికి నిద్రలేకుండా చేస్తున్న ఆరోగ్య సమస్య ఏదైనా ఉందంటే అది మధుమేహం. ఈ సమస్య కారణంగా చాలా మంది తమకు నచ్చినట్టుగా జీవించలేకపోతున్నారు. కోరుకున్న ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారు. చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా చాలా ఎక్కువగా అల్లాడిపోతున్నారు. అలాగే ఎన్నో సమస్యలను అనుభవిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ సమస్య ఉన్న వ్యక్తులు మధుమేహాన్ని సులభంగా తగ్గించుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవన శైలి, వ్యాయామం, మంచి ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి బారి నుంచి మనం బయటపడొచ్చు. అయితే ఎవరైతే మధుమేహంతో బాధపడుతున్నారో వారికి అరటిపువ్వు దివ్య ఔషధంలా పని చేస్తుంది. ఈ పువ్వు తింటే మధుమేహం నుంచి తప్పించుకోవడంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందొచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అసలు మధుమేహం ఉన్న వ్యక్తులకు ఈ అరటిపువ్వు ఏ విధంగా పని చేస్తుంది? దీనిని తినడం వలన ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలను కలుగుతాయి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

మధుమేహం రోగులకు అరటిపువ్వు ఎలా పని చేస్తుందంటే.. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణ వివిధ పరిశోధనల ప్రకారం, అరటి పువ్వులు రక్తంలో గ్లూకోజ్ స్థాయిని స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి. ముఖ్యంగా 2011లో జరిగిన ఓ అధ్యయనంలో మధుమేహంతో బాధపడుతున్న ఎలుకలపై అరటి పువ్వుల ప్రభావాన్ని పరిశీలించారు. ఫలితంగా, ఈ ఎలుకల రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా తగ్గినట్టు కనుగొన్నారు. ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది అరటిపువ్వులో ఉండే సూన్యత కలిగిన ఫైబర్, కొన్ని జీవసక్రియాత్మక పదార్థాలు శరీరంలోని ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. తద్వారా రక్తంలో షుగర్ పెరగకుండా ఉంటుందని పేర్కొంటున్నారు.

మానసిక ఒత్తిడి తగ్గింపు అరటి పువ్వుల్లో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. మెగ్నీషియం సాధారణంగా మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ఈ నేపథ్యంలోనే అరటిపువ్వు తీసుకోవడం వలన అందులోని మెగ్నీషియం మానసిక ఒత్తిడి, ఆందోళనను తగ్గించి మానసిక ప్రశాంతతను పెంచుతుంది. తద్వారా రక్తంలో షుగర్ లెవెల్స్ కంట్రోల్‌లో ఉంటుంది.

## ఘుమఘుమలాడే కాశ్మీరీ చికెన్ మసాలా..






చికెన్ వంటకాలంటే ఎవరికి ఇష్టముండదు చెప్పండి. ఇవి అద్భుతమైన రుచితో ఉంటాయి. చిన్న పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఇష్టపడి తినే ఈ వంటకాలు రకరకాల ప్రదేశాల్లో రకరకాలుగా వండుకుంటుంటారు. అందులో ఒకటే కాశ్మీరీ చికెన్ మసాలా. అబ్బా ఇది నెక్స్ట్ లెవెల్ రుచిగా ఉంటుంది అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందులోని మసాలాలు ఈ కూరను మరింత రుచికరంగా.. అద్భుతంగా మారుస్తాయి. ఒక్క ముద్ద తింటే చాలు.. కడుపు ఫుల్లుగా ఉన్నా, ప్లేట్ కంచం మొత్తం నాకేస్తారు. కానీ దీనిని తినాలంటే రెస్టారెంట్‌కు వెళ్లలేని వారు ఇంట్లోనే చేసుకోవాలని అనుకుంటారు. కానీ వారికి ఎలా చేసుకోవాలో తెలియదు. అందుకే ఈ స్టోరీలో ఈ కాశ్మీరీ చికెన్ మసాలా ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది వివరించాము. పూర్తిగా చదివి మీరు మీ ఇంట్లో ట్రై చేయండి.

కాశ్మీరీ చికెన్ మసాలా తయారీకి కావాల్సిన పదార్థాలు: చికెన్ - 500 గ్రాములు జీడిపప్పు - 100 గ్రాములు ఎండుద్రాక్ష - 50 గ్రాములు పసుపు -½ టీస్పూన్ జీలకర్ర పొడి -½ టీస్పూన్ ధనియాల పొడి - 1 టీస్పూన్ గరం మసాలా -½ టీస్పూన్ కాశ్మీరీ మిర్చి పొడి - 1 టీస్పూన్ అల్లం-వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్ టొమాటో (తరిగినది) - 1 నీరు - 1 కప్పు (అవసరానుసారం) నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు ఉప్పు - రుచికి సరిపడా కొత్తిమీర - గార్నిష్ కోసం

కాశ్మీరీ చికెన్ మసాలా తయారీ విధానం: ఈ కాశ్మీరీ చికెన్ మసాలా తయారు చేసుకోవడానికి ముందు.. జీడిపప్పు, ఎండుద్రాక్షను కొద్దిసేపు నీళ్లలో నానబెట్టి, ఆ తరువాత మిక్సీలో వేసుకొని మెత్తగా రుబ్బుకొని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక బౌల్ తీసుకొని.. అందులో పసుపు, జీలకర్ర పొడి, కాశ్మీరీ మిర్చిపొడి, ధనియాల పొడి, గరం మసాలా, అల్లం వెల్లుల్లి పేస్ట్, తగినంత ఉప్పు వేసుకొని బాగా కలుపుకోవాలి. ఇందులో చికెన్ ముక్కలు వేసుకొని బాగా కలుపుకోవాలి. ఆ తరువాత ఈ మిశ్రమం మొత్తాన్ని ఒక ముప్పై నిమిషాల పాటు మ్యారినేట్ చేసుకోవాలి. అంతే 30 మూత కప్పి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కడాయి పెట్టి అందులో నెయ్యి వేసుకోవాలి. నెయ్యి బాగా వేడెక్కిన తరువాత అందులో మ్యారినేట్ చేసుకున్న చికెన్ ముక్కలను వేసుకొని.. మీడియంగా వేయించుకోవాలి. ఆ తరువాత ఆ చికెన్ ముక్కలన్నిటినీ వేరే గిన్నెలో తీసుకోవాలి. ఆ తరువాత అదే కడాయిలో తరిగిన టమాటో ముక్కలను వేసుకోవాలి. అవి మెత్తబడేవరకు వాటిని వేయించుకోవాలి. ఇప్పుడు ఆ టొమాటోలు అరకప్పు నీళ్లు పోసుకొని రెండు నుంచి మూడు నిమిషాల పాటు మరిగించుకోవాలి. ఈ మిశ్రమంలో ముందుగా తయారు చేసుకొని పెట్టుకున్న జీడిపప్పు, ఎండుద్రాక్షల పేస్ట్ వేసుకొని కలుపుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో వేపుకొని పక్కన పెట్టుకున్న ముక్కలను వేసుకొని మళ్ళీ పది నుంచి పదిహేను నిమిషాల పాటు మూతపెట్టుకొని బాగా మరిగించుకోవాలి. తరువాత సిమ్‌లో ఉడికించుకుంటే చికెన్‌కు మసాలా బాగా పట్టి, చికెన్ మరింత రుచికరంగా మారుతుంది. ఇప్పుడు అందులో కారం, రుచికి సరిపడా ఉప్పు, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసుకొని కలుపుకొని కొంచెం నీళ్లు పోసుకొని కలుపుకోవాలి. ఇప్పుడు మూత తీసి, ఆ మసాలా మీద కొత్తిమీర చల్లుకుంటే ఎంతో రుచికరమైన కాశ్మీరీ చికెన్ మసాలా సిద్ధమైనట్లే. దీనిని రోటి, నాన్, జీరా రైస్‌తో తినొచ్చు. ఇది అద్భుతంగా ఉంటుంది.

## ఈ జ్యూస్ అమృతంతో సమానం..

### ప్రతిరోజూ తాగితే బాడీలో మిరాకిల్స్ జరగడం ఖాయం, అదేంటంటే?



ప్రస్తుతమున్న కాలంలో ఆరోగ్యమే మహాభాగ్యం అయిపోతుంది. మనం తింటున్న తిండి, మన జీవన విధానం వంటి అంశాలన్నీ మనపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. దీని కారణంగా మనిషి చాలా తొందరగా అనారోగ్యానికి గురవుతున్నాడు. అలాగే మనిషి యొక్క ఆయుస్సు కూడా చాలా వరకు తగ్గిపోతుంది. బయట కెమికల్స్ కలిపిన కూల్ డ్రింక్స్ తాగడం, జ్యూస్‌లు తాగడం వంటి వాటి వలన చాలా వరకు ఆరోగ్యం పాడవుతుంది. అవి తాగడం వలన ఆరోగ్యానికి ప్రమాదమే అని తెలిసినా కొంతమంది ఏమీ చేయలేకపోతారు. అలాంటి వారు ఈ అంజీర్ జ్యూస్ తాగితే అద్భుతమైన ఫలితాలు వస్తాయి. ఇది చాలా ప్రయోజనకరమైన జ్యూస్. ఇది ఆరోగ్యానికి చాలా అంటే చాలా మేలు చేస్తుంది. ఇందులో పుష్కలంగా పోషకాలు నిండి ఉంటాయి. అలాగే ప్రతిరోజూ దీనిని తీసుకునే అద్భుతమైన మిరాకిల్స్ జరుగుతాయి. అయితే ఈ స్టోరీలో ఆ జ్యూస్ ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

అంజీర్ జ్యూస్ తయారీకి కావాల్సిన పదార్థాలు: పండిన అంజీర్ - 5 లేదా 6 చల్లటి పాలు - 1 కప్పు తేనె లేదా చక్కెర - 2-3 టేబుల్ స్పూన్లు ఐస్ ముక్కలు - కొద్దిగా యాలకుల పొడి - 1/4 టీస్పూన్ నానబెట్టిన బాదం లేదా జీడిపప్పు - 5-6.

తయారీ విధానం: అంజీర్ పండ్లను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కట్ చేయండి.

బ్లెండర్‌లో అంజీర్ ముక్కలు, పాలు, తేనె (లేదా చక్కెర), యాలకుల పొడి, బాదం లేదా జీడిపప్పు వేసి మెత్తగా బ్లెండ్ చేయండి. చల్లటి ఐస్ ముక్కలు వేసి మరోసారి బ్లెండ్ చేయవచ్చు. గ్లాసులోకి వడకట్టకుండా లేదా వడకట్టి కూడా పోసుకోవచ్చు. వెంటనే తాగితే రుచి మరియు పోషక విలువ ఎక్కువగా ఉంటుంది.

చిట్కాలు: తీపి ఎక్కువగా కావాలంటే ఖర్జూరం లేదా మధుర ద్రాక్షతో బ్లెండ్ చేయవచ్చు. పెరుగుతో కలిపి తాగితే ఇది ఒక శక్తివంతమైన ప్రొబయోటిక్ డ్రింక్‌గా మారుతుంది. వేసవిలో కొబ్బరి నీటితో బ్లెండ్ చేస్తే చక్కని శీతల పానీయం తయారవుతుంది. ఈ జ్యూస్‌ను ఉపాహారంగా లేదా బ్రేక్‌ఫాస్ట్ పానీయం లాగా ఉపయోగించవచ్చు. అంజీర్ జ్యూస్ తాగడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు: జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది అంజీర్‌లో ఉండే అధిక ఫైబర్ జీర్ణవ్యవస్థను చక్కబెట్టడంలో సహాయపడుతుంది. మలబద్ధకం ఉన్నవారికి ఇది బాగా ఉపశమనం ఇస్తుంది. హృదయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది పొటాషియం మరియు యాంటీఆక్సిడెంట్లు గుండెకు మేలు చేసే విధంగా పనిచేస్తాయి. ఇవి రక్తపోటును నియంత్రించి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఇమ్యూనిటీని పెంచుతుంది విటమిన్లు, ఖనిజాలు కలిసిన ఈ పానీయం రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. బరువు నియంత్రణకు సహాయపడుతుంది తక్కువ కేలరీలతో ఎక్కువ ఫైబర్ ఉన్న అంజీర్ జ్యూస్, ఆకలిని నియంత్రించి బరువు తగ్గేందుకు సహాయపడుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది అంజీర్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మానికి నూర్పుతనం అందించి యవ్వనాన్ని కాపాడుతాయి. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించగలదు సాధారణ మోతాదులో తీసుకుంటే, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఎముకల బలానికి తోడ్పడుతుంది అంజీర్‌లో ఉన్న కాల్షియం, మెగ్నీషియం లాంటి ఖనిజాలు ఎముకల దృఢత్వాన్ని పెంపొందిస్తాయి. నిద్ర సమస్యలకు ఉపశమనం అంజీర్‌లోని ట్రిప్టోఫాన్ అనే సహజ రసాయనం నిద్రను ప్రేరేపించడంలో సహాయపడుతుంది. శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది శ్లేష్మం తగ్గించడంలో, గొంతునొప్పిని శాంతింపజేయడంలో ఇది ఉపయోగకరంగా పనిచేస్తుంది. మూత్రపిండాల్లో రాళ్ల నివారణ అంజీర్ మూత్రవిసర్జనను ప్రోత్సహించే లక్షణాలతో, మూత్రపిండాల్లో రాళ్లను ఏర్పడకుండా నిరోధించవచ్చు.



## సొరకాయ అప్పాలు..ఒకటి రెండుతో ఆగరు,ఎలా చేసుకోవాలో చూడండి


సొరకాయ అప్పాలు తయారీకి కావలసిన పదార్థాలు -400 గ్రాముల లేత సొరకాయ తరుగు -ఉప్పు -కరివేపాకు -కొత్తిమీర -పచ్చిమిర్చి -బియ్యం పిండి -నువ్వులు -నానబెట్టిన పెసరపప్పు -నానబెట్టిన పచ్చి శెనగపప్పు -జీలకర్ర -ఉల్లిపాయ తరుగు -ఆయిల్.

సొరకాయ అప్పాలు తయారీ విధానం -ముందుగా లేత సొరకాయ ముక్కను శుభ్రంగా కడిగి తరుగుకొని పక్కనపెట్టుకోవాలి. -తర్వాత మిక్సీ గిన్నెలో 10 పచ్చిమిర్చి,అర స్పూన్ ఉప్పు వేసి నీళ్లు పోయకుండా కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసుకోవాలి. -ఇప్పుడు సొరకాయ తురుములో కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసి పచ్చిమిర్చి పేస్ట్, ఉల్లిపాయ తరుగు, 1 టేబుల్ స్పూన్ జీలకర్ర, 1 కప్పు సన్నగా తరిగిన కొత్తిమీర, అరకప్పు సన్నగా తరిగిన కరివేపాకు, పావుకప్పు నువ్వులు, గంటసేపు నానబెట్టిన పావు కప్పు పెసరపప్పు, గంట సేపు నానబెట్టిన పావు కప్పు పచ్చిశెనగపప్పు,రుచికి సరిపడా ఉప్పు వేసి మొత్తం కలిసేలా కలపాలి. -తర్వాత అందులో 3 కప్పుల బియ్యం పిండి వేసి(సొరకాయ తరుము ఎన్ని కప్పులు వస్తే బియ్యం పిండి అన్ని కప్పులు ఉండాలి)వేసి కలిపి తర్వాత కొంచెం కొంచెం నీళ్లు పోసుకుంటూ కలుపుకోవాలి. మరీ గట్టిగా లేదా మరీ పలుచగా కలపకూడదు. -తర్వాత ఆ పిండిని ముద్దల్లా చేసి పెట్టుకోండి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి ఆయిల్ వేడి చేసి అందులో పిండి ముద్దల్ని కొంచెం మందంగా గారెల షేపులో వత్తుకొని ఆయిల్ లో వేసి వేయించాలి. అంతే సొరకాయ అప్పాలు రెడీ. వీటిని చల్లారని తర్వాత తిన్నా కూడా అద్భుతమైన రుచితో ఉంటాయి.

# సినిమా న్యూస్



## ఒక్క రోజులో 900 కోట్లు తెచ్చిన నక్క కుందేలు



సినిమా ఇండస్ట్రీలో రికార్డులు అనేవి ఈ మధ్య కాలంలో చాలా కామన్ అయిపోయాయి. స్టార్ హీరోల సినిమాలు, భారీ యాక్షన్ చిత్రాలు విడుదలైనప్పుడు వందల కోట్లు కొల్లగొట్టడం మనం చూస్తుంటాం. కానీ ఇప్పుడు బాక్సాఫీస్ దగ్గర జరుగుతున్న మ్యాజిక్ చూసి ట్రేడ్ వర్గాలు షాక్ అవుతున్నాయి. ఇందులో మనకి తెలిసిన పెద్ద హీరోలు ఎవరూ లేరు. కనీసం మనుషులు కూడా స్క్రీన్ మీద కనిపించరు. అయినా సరే కలెక్షన్ల వర్షం కురిపిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. చైనా లాంటి అతిపెద్ద మార్కెట్ లో వేరే దేశాల సినిమాలకు పెద్దగా ఆదరణ ఉండదు. వాళ్ళ లోకల్ కంటెంట్ తప్ప బయటి సినిమాలను అంత త్వరగా పట్టించుకోరు. అలాంటి చోట ఒక హాలీవుడ్ సినిమా ఇప్పుడు సునామీ సృష్టిస్తోంది. అసలు ఇది ఒక సినిమానా లేక బాక్సాఫీస్ దండయాత్రా అనే రేంజ్ లో వసూళ్లు రాబడుతోంది. కేవలం ఒక్క రోజులో వచ్చిన కలెక్షన్స్ చూసి అక్కడి లోకల్ మేకర్స్ కూడా నోరెళ్లబెడుతున్నారు. ఆ సెన్సేషనల్ సినిమా మరేదో కాదు.. 'జూటోపియా 2'. అవును, మీరు విన్నది నిజమే. ఇదొక యానిమేషన్ సినిమా. జంతువుల పాత్రల యానిమేషన్ యాక్షన్, కామెడీ ట్రాక్ లతో ఇప్పటికే పార్ట్ 1 ఒక రేంజ్ లో హిట్టయ్యింది. ఇక సీక్వెల్ మూవీ చైనాలో విడుదలైన మొదటి రోజే ఏకంగా 925 కోట్ల గ్రాస్ వసూలు చేసి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒక యానిమేషన్ సినిమాకు ఈ స్థాయి ఓపెనింగ్స్ రావడం అనేది వరల్డ్ సినిమా హిస్టరీలోనే అరుదు. ప్రపంచవ్యాప్తంగా ఓపెనింగ్ వీకెండ్ లోనే 556 మిలియన్ డాలర్లు వసూలు చేసి గ్లోబల్ బాక్సాఫీస్ ను షేక్ చేసింది. దాదాపు 150 మిలియన్ డాలర్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా, విజువల్స్ పరంగానే కాకుండా కంటెంట్ పరంగా కూడా అదరగొడుతోంది. చైనాలో హాలీవుడ్ సినిమాలకు ఉన్న రికార్డులన్నింటినీ ఈ చిన్న కుందేలు, నక్క కలిసి తిరగరాశాయి. కేవలం నాలుగు రోజుల్లోనే అక్కడ 200 మిలియన్ డాలర్లు వసూలు చేసిందంటే ఈ సినిమా క్రేజ్ ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు కూడా సాధ్యం కాని రీతిలో ఇది దూసుకుపోతోంది. ఇక కథ విషయానికి వస్తే.. డిటెక్టివ్స్ జూడీ హాప్స్, నిక్ వైల్డ్ అనే రెండు పాత్రల చుట్టూ ఈ స్టోరీ తిరుగుతుంది. జూటోపియా నగరాన్ని తలకిందులు చేస్తున్న ఒక మిస్టరీని ఛేదించే క్రమంలో వీరు చేసే సాహసాలు పిల్లలనే కాదు, పెద్దలను కూడా ఆకట్టుకుంటున్నాయి. కొత్త ప్రాంతాల్లోకి వెళ్లి మరీ కేసును సాల్వ్ చేయడానికి వీరు పడే పాట్లు చాలా ఆసక్తికరంగా సాగుతాయి. అందుకే అక్కడ థియేటర్లు హౌస్ ఫుల్ అవుతున్నాయి. యానిమేషన్ సినిమాలకు కేవలం పిల్లలే ఆడియెన్స్ అనుకుంటే పొరపాటే అని ఈ సినిమా నిరూపించింది. కంటెంట్ బాగుంటే భాష, ప్రాంతం, జానర్ తో సంబంధం లేకుండా ఆడియెన్స్ బ్రహ్మరథం పడతారని మరోసారి రుజువైంది.

## "భూత శుద్ధి పద్ధతి"లో సమంత రెండో పెళ్లి.. ప్రత్యేకత ఇదే!



ప్రముఖస్టార్ హీరోయిన్ సమంత ఇన్ని రోజులు ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో రిలేషన్ లో ఉంది అంటూ వార్తలు రాగా.. వాటిని తాజాగా ఆమె కన్ఫామ్ చేసింది. ఈరోజు ఉదయం కోయంబత్తూర్ లోని ఈషాయోగ సెంటర్ సమీపంలో ఉన్న లింగ భైరవి సన్నిధిలో డైరెక్టర్ రాజ్ తో ఏడు అడుగులు వేసి ఈ విషయాన్ని అభిమానులతో పంచుకుంది. ముఖ్యంగా తమ పెళ్ళికి సంబంధించిన ఫోటోలను సమంత తన ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేస్తూ.. తన రెండో పెళ్లి విషయాన్ని అఫీషియల్ గా ప్రకటించింది సమంత. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నూతన జంటకు అభిమానులు, సినీ సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇకపోతే సమంత చేసుకుంది మామూలు పెళ్లి కాదు..ఇక్కడ కనివిని ఎరుగని రీతిలో "భూత శుద్ధి పద్ధతి"లో వివాహం చేసుకుంది అని తెలిసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఏంటి ఈ భూత శుద్ధి పద్ధతి.. ?ఎందుకు ఈ పద్ధతిలో సమంత వివాహం చేసుకుంది? అంటూ పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే సమంత భూత శుద్ధి పద్ధతిలో వివాహం చేసుకుంది అంటూ అందుకు సంబంధించిన విషయాలను తెలియజేస్తూ.. నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేసింది ఈశా ఫౌండేషన్. ఈ మేరకు లింగ భైరవి సన్నిధిలో వివాహం చేసుకోవడానికి గల కారణాన్ని.. అలాగే భూత శుద్ధి పద్ధతిలో ఎందుకు వివాహం చేసుకుంది అనే విషయాన్ని ఈశా ఫౌండేషన్ ఒక ప్రకటన ద్వారా తెలియజేసింది. అసలు ఈశా ఫౌండేషన్ విడుదల చేసిన ప్రకటనలో ఏముంది అనే విషయానికొస్తే.. "కోయంబత్తూర్ లోని ఈశా యోగా కేంద్రం వద్ద ఉన్న లింగ బైరవి సన్నిధిలో సమంత – రాజ్ నిడిమూరు సోమవారం ఉదయం పవిత్రమైన భూత శుద్ధి వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకను అనాదిగా వస్తున్న యోగా సాంప్రదాయం ప్రకారం నిర్వహించడం విశేషం. ఆలోచనలు , భావోద్వేగాలు, భౌతికతకు అతీతంగా దంపతుల మధ్య లోతైన బంధాన్ని ఏర్పరచడానికి రూపొందించిన విశిష్టమైన పవిత్ర ప్రక్రియ ఈ భూత శుద్ధి వివాహం. ముఖ్యంగా ఈ వివాహ ప్రక్రియ వధూవరుల శరీరంలోని పంచభూతాలను శుద్ధి చేస్తుంది. వారి దాంపత్య ప్రయాణంలో శ్రేయస్సు, సామరస్యం, ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా.. ఆ దేవి అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంది" అంటూ ఈశా ఫౌండేషన్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేసింది.

## నటితో అల్లం కషాయం తాగించిన బాలయ్య!



బాలీవుడ్ లో -భజ్ రంగ్ భాయిజాన్- చిత్రంతో బాల నటిగా పరిచయమైంది హర్షాలీ మల్హోత్రా. సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన ఈ చిత్రం 2015లో రిలీజ్ అయింది. ఆ తర్వాత మళ్లీ హర్షాలీ వెండి తెరపై కనిపించలేదు. మళ్లీ పదేళ్లకు అప్పటి బాల నటి ఇప్పుడు పెద్ద నటిగా అలరించడానికి రెడీ అయింది. అదీ ఓ తెలుగు సినిమాతో కావడం విశేషం. మరి బాలీవుడ్ అవకాశాలు రాక పనిచేయలేదా? వచ్చినా వద్దనుకుందా? అన్నది తెలియదు గానీ హర్షాలీ -అఖండ 2-తో టాలీవుడ్లో లాంచ్ అవుతుంది. నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన సినిమా పాన్ ఇండియాలో భారీ అంచనాల మధ్య డిసెంబర్ 5న రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హర్షాలీ టాలీవుడ్ డెబ్యూ పై సంతోషం వ్యక్తం చేసింది. -భజిరంగ్ భాయిజాన్- తర్వాత హిందీలో చాలా అవకాశాలు వచ్చినా నటించలేదంది. -అఖండ 2-లో మంచి పాత్ర కావడంతో ఒకే చెప్పినట్లు తెలిపింది. కథ విన్నాక ఇలాంటి కథ కోసమే ఎదురు చూస్తున్నట్లు అనిపించిందంది. జనని పాత్రలో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటానని ధీమా వ్యక్తం చేసింది. బాలయ్యతో నటించడం కంటే ముందుగా ఆయన నటించిన సినిమా కొన్ని చూసినట్లు తెలిపింది. దీంతో సెట్ లో కి వచ్చిన కొత్తలో కొంత ఒత్తిడికి కూడా గురైనట్లు చెప్పుకొచ్చింది. కానీ బాలయ్య అది గమనించి ధైర్యం చెప్పి, ప్రోత్స హించారని చెప్పింది . తన కుటుంబంలో సభ్యురాలిగా చూసుకున్నారంది. అలాగే అల్లం కషాయం తాగమని కూడా బాలయ్య సలహా ఇచ్చారంది. ఆయన మాట కోసం ఇష్టం లేకపోయినా తాగినట్లు చెప్పుకొచ్చింది. మరి హర్షాలీకి టాలీవుడ్ లో ఇకపై ఎలాంటి అవకాశాలు వస్తాయో చూడాలి. బాల నటిగా ఎంట్రీ ఇచ్చి హీరోయిన్ గా సక్సెస్ అయింది చాలా తక్కువ మందే. వారు కూడా కొన్ని సినిమాలకే పరిమితమయ్యారు. స్టార్ హీరోయిన్లు కాలేకపోయారు. మరి ఈ బాల నటి ఆ సెంటిమెంట్ ని బ్రేక్ చేస్తుందా? అన్నది చూడాలి. ప్రస్తుతం బాలీవుడ్ లో -నాస్తిక్ అనే చిత్రంలో నటిస్తోంది. అలాగే సినిమాలకంటే ముందుగా బుల్లి తెర సీరియల్స్ లోనూ మెరిసింది. మూడు హిందీ సీరియల్స్ లో నటించింది. ఫిలిం ఫేర్, స్టార్ అవార్డులు కూడా దక్కిచుకుంది.

## పెళ్లిపై యువతకు జయాబచ్చన్ సలహా.. పెళ్లి ఢిల్లీ లడ్డూ వంటిదంటూ!



జయాబచ్చన్.. ప్రముఖ నటిగా, రాజకీయ నాయకురాలిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న ఈమె.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ పలు రకాల విషయాలపై స్పందిస్తూ ఉంటారు. అంతేకాదు సమాజానికి సంబంధించిన పలు అంశాలపై కూడా స్పందించే ఈమె.. తాజాగా పెళ్లి గురించి యువతకు ఇచ్చిన సలహాలు విని అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి అనేది ఢిల్లీ లడ్డూ వంటిది అని.. తిన్నా తినకపోయినా సమస్యే అంటూ చెప్పి అందరిని ఆలోచింపజేశారు జయాబచ్చన్. మరి జయాబచ్చన్ యువతకు పెళ్లి విషయంలో ఏ విధంగా సలహాలు ఇచ్చారు అనే విషయం ఇప్పుడు చూద్దాం. తాజాగా "వి ది విమెన్"అనే కార్యక్రమంలో పాల్గొన్న జయా బచ్చన్ తన మనవరాలు నవ్యా నవేలి నందా పెళ్లి గురించి మాట్లాడారు. జయా బచ్చన్ మాట్లాడుతూ.."నేటితరం పిల్లలకు మనం ఎలాంటి సలహాలు ఇవ్వలేము. ఒకప్పటితో పోల్చుకుంటే పరిస్థితులు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా పిల్లలు ప్రతి ఒక్కరు కూడా చాలా తెలివైన వారు. అన్ని విషయాలలో చాలా చక్కగా ఆలోచిస్తున్నారు. ముఖ్యంగా వివాహం విషయంలో ఇలాగే ఉండాలి అని చట్టబద్ధమైన నిర్వచనాలు లేవు. పైగా అలా నిర్వచించాల్సిన అవసరం కూడా లేదు. ఒకరినొకరు అర్థం చేసుకుంటే చాలు. ముఖ్యంగా పెళ్లి అనేది ఢిల్లీ లడ్డు వంటిది. తిన్నా తినకపోయినా సమస్యే. అందుకే యువతకు ఇప్పుడే పెళ్లి చేసుకోమని మాత్రం నేను సలహా ఇవ్వను. ముఖ్యంగా నా మనవరాలు నవ్య ఇప్పుడే పెళ్లి చేసుకోవడం నాకు ఇష్టం లేదు. జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించాలి. ఆమెకు మరికొన్ని రోజుల్లో 28 సంవత్సరాలు నిండుతాయి.. ముందు జీవితాన్ని ఎంజాయ్ చేయమని మాత్రమే చెబుతాను" అంటూ జయాబచ్చన్ పెళ్లిపై యువతకు సలహాలు ఇచ్చింది. ఇక ప్రస్తుతం జయా బచ్చన్ చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. నవ్య నవేలి విషయానికి వస్తే.. అమితాబ్ బచ్చన్ – జయా బచ్చన్ కూతురు శ్వేతా బచ్చన్ కూతురైన నవ్య.. ఒక యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తోంది. జెండర్ ఈక్వాలిటీ కోసం పనిచేస్తోంది. ఐఐఎం అహ్మదాబాద్ లో బిజినెస్ డిగ్రీ పూర్తి చేసిన నవ్య.. తన తాత, తండ్రి స్థాపించిన.. అగ్రికల్చర్ పరికరాలు తయారు చేసే %జుంఎశీతీం ఖబఎశ్మీ శ్రీఱఎఙవం% అనే తమ కంపెనీలో మూడేళ్ల పాటు ఇంటర్న్ షిప్ కూడా పూర్తి చేసింది. ముఖ్యంగా తండ్రి , తాత లాగే అగ్రికల్చర్ సెక్టార్లో పనిచేయాలని.. బిజినెస్ లో ఎదగాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. ఇప్పటికే బిజినెస్ లో పలు అవార్డు కూడా అందుకున్న నవ్య తన తండ్రి కంపెనీలో 0.02% స్టాక్స్ కూడా కలిగి ఉంది. దీని విలువ సుమారుగా ఏడున్నర కోటికి పైగానే ఉంటుందని సమాచారం.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com